Follow: @ANNTELUGU

ANN తెలుగు

12-11-2024

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 301 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI | REGISTERED NUMBER: APTEL/2003/9316 | WWW.EPAPER.MAHAADAILY.COM

## రేవంత్ సర్కారును కూల్చే కుట్ర?



సోమవారం నాడు తెలంగాణలో నాలుగైదు ప్రాంతాల్లో జరిగిన ఘటనలు పలు అనుమానాలకు ఆస్కారం కలిగిస్తున్నాయి.మాజీ సర్పంచుల ఆందోళనలు,ఆటో డ్రైవర్ల ఉద్యమాలు.. ఇతర అంశాలు ఒక ఎత్తు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై రాళ్లతో జరిగిన దాడి మరో ఎత్తు! వీటన్నింటినీ ఒక దారంతో కలిపి చూస్తే భారీ ప్రణాళిక,అంతకు మించిన కుట్ర కూడా కనబడే అవకాశాలు తోసిపుచ్చలేం.

వివరాలు 3లో

## ఢిల్లీలో అడుగుపెట్టా హైదరాబాద్‌లో ప్రకంపనలు

- కేటీఆర్ వరుస ట్వీట్లు
- అమృత్ టెండర్లపై కేంద్రమంత్రికి ఫిర్యాదు



02

## కేంద్ర మంత్రితో నీకేంపని కేటీఆర్?

- అరెస్ట్ భయంతో కాళ్లు పట్టుకోవడానికే ఢిల్లీ టూర్
- మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు



02

## బీఆర్ఎస్ వైఖరిని బీసీ సంఘాలు నిలదీయాలి

- బీజేపీ బీ టీంగా కేసీఆర్ అండ్ కో
- అందుకే ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం
- బీఆర్ఎస్ పై మంత్రి సీతక్క ఫైర్




03



## సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం

ఢిల్లీ, మహా: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం రాష్ట్రపతి భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. వచ్చే ఏడాది మే 13 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. 2019 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్న ఆయన పలు కీలక తీర్పులు ఇచ్చారు.





## విజయ్ దేవరకొండ ప్రైవేట్ ఆల్బమ్ సాహిబా ప్రోమో

రౌడీ హీరో విజయ్ దేవరకొండ బాలీవుడ్‌లో ప్రైవేట్ ఆల్బమ్ చేస్తున్న విషయం తెలిసిందే. హీరియే పాటతో క్రేజ్ తెచ్చుకున్న బాలీవుడ్ సెన్సేషనల్ సింగర్ జాస్లీన్ రాయల్ విజయ్‌తో ఈ ఆల్బమ్ చేస్తుంది. 'సాహిబా' అంటూ ఈ ఆల్బమ్ రానుండగా.. ఇందులో విజయ్ సరసన రాధిక మోహన్ నటిస్తుంది. ఇప్పటికే రాధికా-జస్లీన్ రాయల్ కాంబినేషన్‌లో వచ్చిన 'సై జానా' సాంగ్ సూపర్ సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ సాంగ్ ఎలా ఉండబోతుందని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు. ఈ ఆల్బమ్‌కి సంబంధించి ఇప్పటికే ఫస్ట్ లుక్‌లు విడుదల చేయగా.. ఆకట్టుకుంటున్నాయి.

## మీ ఇంట్లో నాలుగు ఉద్యోగాలు తప్ప..

# తెలంగాణ ఏం కోల్పోలేదు



### కేసీఆర్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ కౌంటర్

తెలంగాణ సమాజం నిన్ను మరిచిపోయింది

ఈ పదిమాసాల్లో 50వేల ఉద్యోగ నియామకపత్రాలిచ్చాం

నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించడమే నాకు సంతృప్తి

ఏఎంవీఐలకు ఉద్యోగనియామకపత్రాలు అందించిన సీఎం

పది నెలల్లో ఏం కోల్పోయిందో ప్రజలు తెలుసుకున్నారని ఒక పెద్దాయన అంటున్నారని తెలంగాణ ఏం కోల్పోలేదని పెద్దాయన ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ పది నెలల్లో నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారని, రైతులు రైతు రుణమాఫీతో రుణ విముక్తులయ్యారని చెప్పారు. అలాగే 1కోటి 5లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో లబ్ది పొందారన్నారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు అప్పట్లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బాట పట్టారని కానీ గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

వివరాలు 2లో

### డ్రగ్స్ తీసుకుంటూ దొరికి దబాయింపా?

ప్రజాప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. డ్రగ్స్ తీసుకుంటూ దొరికినా మమ్మల్ని పట్టుకోవద్దని దబాయిస్తున్నారు. ఫామ్‌హౌస్‌లో కొందరు మద్యం సేవించి దీపావళి చేసుకుంటున్నారు. చిచ్చుబుడ్లకు బదులు సారాబుడ్లతో కొందరు దీపావళి జరుపుకుంటున్నారు. అంటూ సీఎం ఫైర్ అయ్యారు.

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 79,360 |
| 22 క్యారెట్ | 72,750 |
| సిల్వర్ (కేజీ) | 94,000 |

| స్టాక్ మార్కెట్ | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 79,486.32 |
| నిఫ్టీ ↗ | 24,148.20 |

**ఈరోజు చికెన్ ధరలు**

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర ₹ | 160 | 200 | 210 |
| హోల్ సేల్ ధర ₹ | 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ ₹ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.55 | 166.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.55 | 166.5 |
| రిటైల్ గుడ్డు ధర | 5.88 | 176.49 |




## సీఎం ఇలాకాలో కలెక్టర్‌పై దాడి

రాళ్లు, కర్రలతో తిరగబడ్డ రైతులు

### దాడిపై అధికారుల నిరసన

ప్రభుత్వం సీరియస్.. రంగంలోకి డీజీపీ

**వికారాబాద్, మహా :** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజవకర్గం లగచర్ల గ్రామంలో ఓ ఫార్మాసంస్థ భూసేకరణ కోసం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ రణరంగంలా మారింది. గ్రామసభ నిర్వహించేందుకు రెవెన్యూ సిబ్బందితో కలిసి వచ్చిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో స్థానికులు వాగ్వాదానికి దిగారు. గ్రామసభను ఊరికి దూరంగా ఏర్పాటుచేయడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు.

మిగతా 2లో

## పొలిటికల్ బాంబుకు.. టైమర్ సెట్

### కదిలిన.. ట్యాపింగ్ తీగ




మాజీ ఎమ్మెల్యే చిరుమర్తికి సమన్లు

జూబ్లీహిల్స్ పీఎస్‌కు రావాలంటూ పిలుపు

మరికొందరికి నోటీసులు జారీ చేసే అవకాశం

ఇప్పటికే ఓ ఎమ్మెల్సీ ఫిక్స్

02

## సుప్రీం కోర్టు తీర్పు ప్రకారమే సర్వే

- రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్
- సర్వేకు సహకరించండి.. కాంగ్రెస్ శ్రేణులకు టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆదేశం



02

## బండి సంజయ్ మానవత్వం

- లారీ కింద ఇరుక్కుపోయి
- కేంద్ర మంత్రి చొరవతో బయటపడ్డ మహిళ
- బండి సంజయ్‌కు ప్రశంసలు




02

## రాష్ట్రంలో 13 మంది ఐఏఎస్‌లు బదిలీ


జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి



03

## మీ ఇంట్లో నాలుగు ఉద్యోగాలు తప్ప..

# తెలంగాణ ఏం కోల్పోలేదు



**హైదరాబాద్, మహా:** పది నెలల్లో ఏం కోల్పోయిందో ప్రజలు తెలుసుకున్నారని ఒక పెద్దాయన అంటున్నారని తెలంగాణ ఏం కోల్పోలేదని పెద్దాయన ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ పది నెలల్లో నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారని, రైతులు రైతు రుణమాఫీతో రుణ విముక్తులయ్యారని చెప్పారు. అలాగే 1కోటి 5లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో లబ్ది పొందారన్నారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు అప్పట్లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బాట పట్టారని కానీ గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 50 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని తెలిపారు. నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించడం తనకు సంతృప్తిని ఇస్తుందన్నారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో 99 మంది ఏఎంవీఐలకు సీఎం ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. నష్టాల్లో కూరుకున్న ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది. 49 లక్షల 90వేల కుటుంబాలు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వినియోగించుకుంటున్నారు. రూ.500లకే మా ఆడబిడ్డలు వంటగ్యాస్ సిలిండర్ అందుకోగలుగుతున్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10లక్షల వరకు ఉచిత వైద్యం అందుకోగలుగుతున్నారు. 21వేల మంది టీచర్లు పదోన్నతులు పొందగలిగారు. 35వేల మంది టీచర్ల బదిలీలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిది. కేసీఆర్ వాస్తు కోసం సచివాలయం, ప్రగతి భవన్ కట్టుకుండు కానీ.. రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించలేదు. మా ప్రభుత్వం రాగానే 100 నియోజవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. విద్యనే తెలంగాణ సమాజాన్ని నిర్మిస్తుందని నిరూపిస్తున్నామని చెప్పారు.

### తెలంగాణ సమాజం నిన్ను మరిచిపోయింది

ఇక ఎన్ని అడ్డంకులు సృష్టించినా 563 గ్రూప్ ఉద్యోగాలకు విజయవంతంగా పరీక్షలు నిర్వహించాం. త్వరలో వారికి నియామకపత్రాలు అందించి.. వారిని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేస్తామని చెప్పారు రేవంత్. పది నెలల్లో రైతులు, నిరుద్యోగులను ఆదుకున్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ఇవన్నీ చేసాం. మీరు లేకపోయినా ఏం బాధలేదు. మీతో ప్రజలకేం పని లేదు. తెలంగాణ సమాజం నిన్ను మరిచిపోయింది. ఇప్పటికైనా మీలో మార్పు రావాలి. ప్రభుత్వం చేసే మంచి పనులకు మద్దతు ఇవ్వండి. లోపాలు ఉంటే సలహాలు ఇవ్వండి. బడి దొంగలను చూసాం కానీ.. ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి రాకుండా ఉన్న విచిత్ర పరిస్థితి తెలంగాణలో చూస్తున్నామంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు అధికారులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ మానవత్వం



**కరీంనగర్, మహా:** బైక్పై వెళ్తూ కిందపడిపోయి లారీ కింద ఇరుక్కుపోయి కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో తృటిలో ఓ మహిళ ప్రాణాలు దక్కించుకుంది. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం సింగాపూర్ శివారులో ఉదయం ఓ ప్రమాదం జరిగింది. కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు మండలం ఖెల్లడకు చెందిన దివ్యశ్రీ భర్తతో కలిసి హుజురాబాద్లో పని చేసుకొని స్వగ్రామానికి వెళ్తోంది. బైక్పై వెళ్తున్న సమయంలో కళ్లు తిరిగి రోడ్డుపై పడిపోయి వెనుక వస్తున్న లారీ కిందకు వెళ్లింది. ఈ ఘటనలో ఆమె జుట్టు లారీ ముందు టైర్, రాడ్ల మధ్య ఇరుక్కుపోయింది. కేకలు వేయడంతో డ్రైవర్ లారీని ఆపేశాడు. అదే సమయంలో అటుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ములుగు వెళుతూ ఘటనా స్థలి వద్ద ఆగారు. లారీ కింద టైర్ పక్కన రాడ్డులో జుట్టు చిక్కుకొని రక్తమోడుతూ వేళాడుతున్న దివ్యశ్రీని చూసి ధైర్యం చెప్పారు. ఇరుక్కుపోయిన జుట్టును కట్టర్ల సాయంతో కత్తిరించి దివ్యశ్రీని బయటకు తీయాలని అక్కడున్న వారికి సూచించారు. తరువాత రక్షించిన తరువాత కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి పంపించారు. దివ్యశ్రీ వైద్య ఖర్చులన్నీ తానే భరిస్తానని, మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు బండి సంజయ్ ఫోన్లో చెప్పారు. ఎవరికి ఆపదొచ్చినా తానున్నాననే భరోసా ఇచ్చే బండి సంజయ్ తమ పాలిట దేవుడయ్యారని కుటుంబసభ్యులు 'కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎం రేవంత్ ఇలాకాలో

# కలెక్టర్‌పై దాడి



(మొదటిపేజీ తరువాయి)

గ్రామసభ వద్ద ఉన్న ఇద్దరు రైతుల అభ్యంతరంతో కలెక్టర్ లగచర్ల గ్రామానికి చర్చల కోసం వెళ్లారు. కలెక్టర్ ఊర్లోగి రాగానే ఆయనకు వ్యతిరేకంగా అన్నదాతలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ వెనక్కి వెళ్లిపోవాలంటూ కారుపై రాళ్లు విసిరారు. కారు దిగి రైతులతో చర్చించేందుకు వచ్చిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నదాతలను ఒప్పించేందుకు ప్రయత్నించారు. సహనం కోల్పోయిన స్థానిక రైతులు కలెక్టర్ ప్రతీక్‌జైన్, తహశీల్దార్ కార్లపై రాళ్లు విసిరారు. పరిస్థితిని గమనించి అక్కడి నుంచి కలెక్టర్, రెవెన్యూ సిబ్బంది వెనుదిరిగారు.

రక్షణగా వచ్చిన పోలీసులపైనా స్థానికులు దాడి : పరిస్థితిని ముందే ఊహించి భారీ బందోబస్తు ఏర్పాటుచేసినప్పటికీ.. పోలీసులంతా గ్రామసభ జరిగే ప్రాంతంలో మోహరించారు. చర్చల కోసం వచ్చిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ వద్ద భద్రత లేకపోవడం గ్రామస్థులు దాడికి దిగడానికి అనుకూలంగా మారింది. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని దుద్యాల మండలంలో 1,350 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి ఫార్మా కంపెనీకి ఇవ్వాలని నిర్ణయించింది. ఇక్కడ ప్రభుత్వ భూమి 156 ఎకరాలే ఉంది. మిగతాది పట్టాభూముల నుంచి సేకరించాలి. దీన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ఉద్రిక్తతకు దారితీసింది. ఫార్మాసంస్థ ఏర్పాటుకు కారణం సదరు కాంగ్రెస్ నాయకుడే అంటూ ఆయన కారుపై రాళ్లు రువ్వి, అద్దాలు ధ్వంసం చేశారు. రక్షణగా వచ్చిన పోలీసులపైనా స్థానికులు తిరగబడ్డారు. పరిస్థితి అదుపుచేసేందుకు లాఠీఛార్జి చేసి ప్రజలను చెదరగొట్టాల్సి వచ్చింది. రైతులు మాత్రం బంగారం లాంటి తమ భూములను ఔషధ కంపెనీకి ఇచ్చేదే లేదంటూ తెగేసి చెబుతున్నారు. బలవంతంగా భూసేకరణ చేపడితే మాత్రం ఎంతవరకైనా వెళతామని హెచ్చరిస్తున్నారు.

## రాళ్లు, కర్రలతో తిరగబడ్డ రైతులు

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజవకర్గం లగచర్ల గ్రామంలో ఓ ఫార్మాసంస్థ భూసేకరణ కోసం చేపట్టిన ప్రజాభిప్రాయసేకరణ రణరంగంలా మారింది. గ్రామసభ నిర్వహించేందుకు రెవెన్యూ సిబ్బందితో కలిసి వచ్చిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో స్థానికులు వాగ్వాదానికి దిగారు. గ్రామసభను ఊరికి దూరంగా ఏర్పాటుచేయడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. గ్రామసభ వద్ద ఉన్న ఇద్దరు రైతుల అభ్యంతరంతో కలెక్టర్ లగచర్ల గ్రామానికి చర్చల కోసం వెళ్లారు. కలెక్టర్ ఊర్లోగి రాగానే ఆయనకు వ్యతిరేకంగా అన్నదాతలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ వెనక్కి వెళ్లిపోవాలంటూ కారుపై రాళ్లు విసిరారు. కారు దిగి రైతులతో చర్చించేందుకు వచ్చిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నదాతలను ఒప్పించేందుకు ప్రయత్నించారు. సహనం కోల్పోయిన స్థానిక రైతులు కలెక్టర్ ప్రతీక్‌జైన్, తహశీల్దార్ కార్లపై రాళ్లు విసిరారు. పరిస్థితిని గమనించి అక్కడి నుంచి కలెక్టర్, రెవెన్యూ సిబ్బంది వెనుదిరిగారు. రక్షణగా వచ్చిన పోలీసులపైనా స్థానికులు దాడి : పరిస్థితిని ముందే ఊహించి భారీ బందోబస్తు ఏర్పాటుచేసినప్పటికీ.. పోలీసులంతా గ్రామసభ జరిగే ప్రాంతంలో మోహరించారు. చర్చల కోసం వచ్చిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ వద్ద భద్రత లేకపోవడం గ్రామస్థులు దాడికి దిగడానికి అనుకూలంగా మారింది. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని దుద్యాల మండలంలో 1,350 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి ఫార్మా కంపెనీకి ఇవ్వాలని నిర్ణయించింది. ఇక్కడ ప్రభుత్వ భూమి 156 ఎకరాలే ఉంది. మిగతాది పట్టాభూముల నుంచి సేకరించాలి. దీన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణ ఉద్రిక్తతకు దారితీసింది. ఫార్మాసంస్థ ఏర్పాటుకు కారణం సదరు కాంగ్రెస్ నాయకుడే అంటూ ఆయన కారుపై రాళ్లు రువ్వి, అద్దాలు ధ్వంసం చేశారు. రక్షణగా వచ్చిన పోలీసులపైనా స్థానికులు తిరగబడ్డారు. పరిస్థితి అదుపుచేసేందుకు లాఠీఛార్జి చేసి ప్రజలను చెదరగొట్టాల్సి వచ్చింది. రైతులు మాత్రం బంగారం లాంటి తమ భూములను ఔషధ కంపెనీకి ఇచ్చేదే లేదంటూ తెగేసి చెబుతున్నారు. బలవంతంగా భూసేకరణ చేపడితే మాత్రం ఎంతవరకైనా వెళతామని హెచ్చరిస్తున్నారు.



## పత్తి రైతుల కష్టాలు పట్టవా?

**భగ్గుమన్న మాజీమంత్రి హరీష్**

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ ఎక్స్ వేదికగా మంత్రి పోస్టు చేశారు. అకాల వర్షాలతో దిగుబడి తగ్గి ఇప్పటికే నష్టపోయిన పత్తి రైతులకు, కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం శాపంగా మారడం శోచనీయమన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కనీస మద్దతు ధరకు కూడా అమ్ముకోలేని దుస్థితికి తెలంగాణ రైతాంగాన్ని చేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. సీసీఐ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా పత్తి కొనుగోలు చేయబోమని రాష్ట్ర జిన్నింగ్, మిల్లుల యాజమాన్యాలు ప్రకటిస్తే సమస్యకు పరిష్కారం చూపే కనీస ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. పత్తి రైతులు రోడ్లెక్కి లబోదిబోమంటుంటే అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా.. లేనట్లా అని ప్రశ్నించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అలసత్వం, సమన్వయ లోపంతో పత్తి రైతులు చిత్తవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఫోటోలకు ఫోజులిచ్చిన మంత్రులు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. పంట చేతికి వచ్చిన ఈ సమయంలో రైతుల జీవితాలతో చెలగాటమాడటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లుల వద్దకు చేరిన పత్తి లారీల లోడ్లతో రైతులు ఎన్ని రోజులు ఎదురుచూడాలన్నారు. పక్క రాష్ట్రాల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడానికి సమయం ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులకు రైతుల సమస్యలు పట్టించుకునే సమయం లేదా అని అడిగారు. తేమ శాతం సడలింపు, కొత్త నిబంధనల విషయమై ఢిల్లీకి వెళ్లి సీసీఐ అధికారులకు విజ్ఞప్తి చేసే తీరిక లేదా అని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మొద్దునిద్ర వీడి తేమ శాతం సహా ఇతర నిబంధనల విషయంలో కేంద్రంపై, ఒత్తిడి తేవాలని, అన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అంటూ హరీష్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు.

# దేశంలో రెండే పరివార్లు

- ఒకటి మోడీ పరివార్.. రెండోది గాంధీ పరివార్
- మోడీని ఓడించి రాహుల్ ను ప్రధానిని చేద్దాం
- సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడంలో మైనారిటీలు కీలక పాత్ర పోషించారని, హిందూ, ముస్లింలు తెలంగాణ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటి వారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మీరంతా అండగా ఉంటే విద్య, వైద్యం, ఉపాధి విషయంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామని అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకలు జరిగాయి... ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉన్నవి రెండే పరివార్లు అని, ఒకటి మోదీ పరివార్ .. రెండోది గాంధీ పరివార్ అని అన్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు మోదీ పరివార్ పనిచేస్తోందని, దేశ సమైక్యతకు గాంధీ పరివార్ కృషి చేస్తోందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

దేశ ప్రజలకు మెరుగైన విద్య అందించేందుకు ఆనాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ముస్లింలను మేము ఓటర్లుగా చూడటంలేదని, సోదరులుగా, కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క మైనారిటీని కూడా ఎమ్మెల్యేగా గెలిపించుకోలేదని, అందుకే మైనారిటీ మంత్రి ఇచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. కానీ షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారులుగా చేసామని, అమీర్ అలీ ఖాన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చామని, కార్పొరేషన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరువాత ఇప్పటి వరకు సీఎంవోలో మైనారిటీ అధికారిని నియమించలేదని, మన ప్రభుత్వంలో సీఎంవోలో ఒక మైనారిటీ అధికారిని నియమించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో మైనారిటీలకు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చిందన్నారు. మోదీ పరివార్‌తో ఉండాలో..గాంధీ పరివార్‌తో ఉండాలో మీరే నిర్ణయించుకోండన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకొచ్చేందుకు మైనారిటీలు కృషి చేయాలని పిలుపిచ్చారు. దేశంలో కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, మహారాష్ట్రలో మహావికాస్ అగాడి కూటమిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. దేశంలో మోదీని ఓడించి రాహుల్ గాంధీని ప్రధానిగా చూసే వరకు విశ్రమించొద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపిచ్చారు.

# కలెక్టర్‌పై దాడి



- ఉద్యోగుల నిరసన
- ఉద్యోగుల పెన్ డౌన్‌కు పిలుపు

**వికారాబాద్, మహా :** జిల్లా కలెక్టర్ పై లగచర్ల గ్రామంలో జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం సీరియస్ అయింది. కలెక్టర్ మీద దాడి జరగడంపై రిపోర్ట్ ఇవ్వాలని సీఎస్, డీజీపీలను ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు కలెక్టర్‌పై దాడి చేయడాన్ని ఖండిస్తూ నిరసనకు దిగిన అధికారులు వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై గ్రామస్థులు దాడి చేయడాన్ని ఖండిస్తూ కలెక్టర్ కార్యాలయానికి తాళం వేసి సిబ్బంది నిరసనకు దిగారు. ఏకంగా కలెక్టర్‌పైనే దాడి చేస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించిన అధికారులు. రేపటి నుంచి పెన్ డౌన్ చేస్తున్నట్లు ప్రకటించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించే వరకు నిరసన కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, కలెక్టర్ పై దాడి ఘటన మీద సీఎస్ శాంతికుమారి ఇప్పటికే ఆరా తీశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో సీఎస్ ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై నివేదిక పంపాలని జిల్లా యంత్రాంగాన్ని సీఎస్ ఆదేశించారు. ఫార్మా కంపెనీల కోసం భూసేకరణ విషయమై వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లగచర్ల వెళ్లినపుడు గ్రామస్తులు ఒక్కసారిగా ఆయనపై దాడికి దిగడంతో తప్పించుకున్న కలెక్టర్.

## మంగల్‌పల్లి గేట్ వద్ద ఘోర ప్రమాదం

**తల్లి మృతి, కొడుకు పరిస్థితి విషమం**



**ఇబ్రహీంపట్నం మహా:** ఆదిభట్ల మున్సిపాలిటీ, మంగల్‌పల్లి గేట్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. ఇబ్రహీంపట్నం సిఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం బియన్ రెడ్డి నగర్ నందిహిల్స్ నివాసముండే, పోలేపాక సాయిలు తన భార్య, కొడుకుతో కలిసి కిష్టాపురం గ్రామానికి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా మార్గ మధ్యలో మంగల్‌పల్లి గేటు వద్దకు చేరుకోగా, కళ్లద్దాలు కొనేందుకు రోడ్డుకు ఎడమవైపు మోటార్ సైకిల్ ను నిలిపాను. ఇంతలో మారుతీ సుజుకీ సెలెరియో కారు ఇబ్రహీంపట్నం వైపు వెళ్తూ డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడపడంతో, బైక్‌ను వెనుక నుండి ఢీకొట్టగా పోలేపాక రాములమ్మ (35) అక్కడికక్కడే మృతిచందగా, పోలేపాక అరుణ్ కుమార్ (14) బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే 108 వాహనంలో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించడం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు.

## కేంద్ర మంత్రితో

# నీకేంపని కేటీఆర్?



**హైదరాబాద్, మహా:** కవితకు బెయిల్ ఎలా వచ్చిందో తమ దగ్గర ఆధారాలున్నాని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ఈ మేరకు ఖమ్మం రూరల్ మండలం చిన్నవెంకటగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన పొంగులేటి.. కేంద్ర మంత్రులను ప్రాధేయపడి కేసులు వెనక్కి తీసుకోవడానికి ఢిల్లీకి వెళ్లారా కేటీఆర్ అని ప్రశ్నించారు. ఢిల్లీలో నీకేం పని కేటీఆర్ అంటూ ధ్వజమెత్తారు. గత దొరపాలనలో తెలంగాణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, పార్టీ నాయకులు జారిపోతారానే భయంతో మళ్లీ వచ్చే ఎన్నికల్లో గెలుస్తామని వారిని మభ్యపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా తమ ప్రభుత్వం అప్పులు కడుతూనే సంక్షేమ పథకాలు అందిస్తోందని అన్నారు.

### ప్రాధేయపడేందుకే

ఈ రేస్ కార్ల పందెంలో జరిగిన అవినీతిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు రెస్పాన్స్ రాలేదన్నారు. కేంద్ర మంత్రులను ప్రాధేయపడి కేసులు వెనక్కి తీసుకోవడానికి ఢిల్లీకి వెళ్లారా కేటీఆర్ అని ప్రశ్నించారు. అదానీ, అంబానీ లేదా ఢిల్లీలో ఎవరిని కలిసారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత లిక్కర్ స్కాంలో ఎవరి ప్రమేయంతో బెయిల్ పొందారో అదే రీతీలో ఢిల్లీలో ఎవరిని కలిసారో మాదగ్గర ఆధారాలు ఉన్నాయన్నారు. రెండు, మూడు రోజుల్లో ఏ బాంబు పేలుతుందో కేటీఆర్ కు తెలుసు. ఈ క్రమంలోనే కేటీఆర్ ఢిల్లీ పర్యటన హడావుడిగా చేసారు. ఈకార్ రేస్ లో తప్పు జరగ్గకుంటే ఎందుకు భయపడుతున్నారని అన్నారు. ఇక విదేశాలకు 55 కోట్ల రూపాయలు ఎలా వెళ్లాయో చెప్పాలని ప్రశ్నించారు. డబ్బులు చేతికి అందాకే ఎంవోయూలో సంతకాలు జరిగాయని ఆరోపించారు. ఒక్క కేసుకే ఇంత కంగారు పడితే అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ఆ అన్నింటిని బయటపడేతే అంతరిక్షంలో కూసుంటారంటూ సెటైర్స్ వేశారు. పేదోడికి చెందాల్సిన ఆస్తులను కొల్లగొట్టిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు.

# సుప్రీంకోర్టు తీర్పు ప్రకారమే సర్వే



**వేములవాడ, మహా:** కాంగ్రెస్లో బీసీలకు అన్యాయం జరిగితే ప్రతి నాయకుడు ప్రశ్నిస్తారని, బీఆర్ఎస్లో మాత్రం ఆ స్వేచ్ఛలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా ఇవాళ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టీటీడీ బోర్డు మాజీ ఛైర్మన్ బాపిరాజులతో కలిసి కుటుంబ సమేతంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో కోడె మొక్కులు చెల్లించి, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం అందించగా, ఆలయ ఈవో వినోద్ రెడ్డి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ డైరెక్షన్ ఒకటే అని విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి సర్వేతో బీజేపీ, బీఆర్ఎస్లకు భయం పట్టుకుందని, అందుకే సర్వేను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బీసీ కమిషన్ వేసి లెక్కలు తేల్చిన అనంతరం ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడ్డాయని మంత్రి పొన్నం తెలిపారు. ఎన్నికల్లో ఓట్ల కోసం సర్వే చేయడం లేదని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాధ్యతతో సర్వే చేస్తున్నామన్నారు. సర్వేలో ఆధార్ ఇవ్వడం ఆప్షన్ అని, పాన్ కార్డు అడగడం లేదన్నారు. వివరాలు చెప్పాలనుకుంటే చెప్పాలని, లేదంటే అవసరం లేదన్నారు. కులం చెప్పకుంటే 999 ఆప్షన్ ఉందని, సర్వేకు వస్తున్న ఎన్యూమరేటర్ల విధులకు ఆటంకం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పొలిటికల్ బాంబుకు.. టైమర్ సెట్

**మహా, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటి వరకు అధికారులే జైలుకు వెళ్లగా.. ఇప్పుడు నేతల వంతు వచ్చింది. తాజాగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ఈ కేసులో పోలీసు ఉన్నతాధికారులు సమన్లు జారీ చేశారు . సోమవారం జూబ్లీహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ నోటీసులు ఇచ్చారు . మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు జారీ అవడంతో రాజకీయవర్గాల్లో సంచలనం రేకెత్తుతోంది. మొదటిసారిగా ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ నాయకుడికి నోటీసులు జారీ కావడంతో.. ఉత్కంఠ నెలకొంది. తర్వాత నోటీసులు అందుకునేది ఎవరా? అనే చర్చ జరుగుతోంది. ట్యాపింగ్ కేసులో నేతలకు నోటీసులు రావడం ఇదే మొదటిసారి కాగా, ఓ ఎమ్మెల్సీకి కూడా ఉచ్చు బిగుస్తున్నదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### చిరుమర్తి ప్రమేయం

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రమేయం ఉన్నట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. తన ప్రత్యర్థుల ఫోన్లు ట్యాప్ చేసి నిఘా ఉంచినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే.. ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. ఈ కేసులో ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు అరెస్ట్ అవగా.. రాజకీయ నాయకులు కూడా అరెస్ట్ అవుతారంటూ కాంగ్రెస్ నేతలు ప్రకటిస్తూ వస్తున్నారు. ఇలాంటి తరుణంలో.. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తికి నోటీసులు జారీ చేయడంపై మరింత ఉత్కంఠ నెలకొంది. ఇప్పటి వరకు అధికారులు.. ఇక నుంచి రాజకీయ నేతల వరుస వచ్చిందనే టాక్ నడుస్తోంది. మరి తర్వాత ఎవరికి నోటీసులు జారీ చేస్తారు? ఎవరెవరికి ఈ కేసులో ప్రమేయం ఉందోననే ఆసక్తి ప్రజల్లో నెలకొంది. ముఖ్యంగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నట్లు పొలిటికల్ బాంబులు ఈ కేసులోనే పేలనున్నాయా? మరేదైనా కేసులోనా? అనే చర్చ నడుస్తోంది.

### ఇప్పటి వరకు అధికారులే అరెస్ట్

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా ఏ1 ప్రభాకర రావు, రిటైర్డ్ ఐపీఎస్, ప్రణీత్ రావు డీఎస్పీ, ఏ3 రాధాకిషన్ రావు, రిటైర్డ్ అదనపు ఎస్పీ, ఏ4 భుజంగ రావు, అదనపు ఎస్పీ, ఏ5 తిరుపతన్న, అదనపు ఎస్పీ, రిటైర్డ్ అదనపు ఎస్పీ వేణుగోపాల్ రావు, గట్టుమల్లు భూపతి అరెస్ట్ అయ్యారు. ప్రభాకర రావు ఒక్కరే విదేశాల్లో ఉన్నారు. వీరంతా కలిసి ప్రతిపక్ష నాయకులు, అధికార పక్ష నాయకులు, సినిమా, వ్యాపార ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రణీత్ రావు అరెస్ట్‌తో ఈ వ్యవహారం మొత్తం బయటపడింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రత్యేక బృందంతో విచారణ జరిపించింది. ఈ కేసును విచారించే కొద్ది కొత్త కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని నిర్ధారించారు పోలీసులు. రేపో మాపో పొలిటికల్ లీడర్స్‌కి కూడా నోటీసులు అందజేస్తారనే ప్రచారం జరిగింది. దానికి కొనసాగింపుగానే.. సోమవారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసులు జారీ చేశారు పోలీసులు. ఆ తర్వాత ఓ ఎమ్మెల్సీని ఫిక్స్ చేస్తారని, తర్వాత మరికొందరికి ఉచ్చు బిగించవచ్చన్న చర్చలు జరుగుతున్నాయి. పొలిటికల్ బాంబుకు టైమర్ సెట్ అయిందని, పేలడమే ఆలస్యమని మరికొందరు అంటున్నారు.

# రేవంత్ సర్కారును కూల్చే కుట్ర?

తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారు.కానీ బీఆర్ఎస్ మాత్రం ఈ ప్రజా ప్రభుత్వాన్ని పడగొడతామని అంటున్నది'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నెలల కిందట ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.''కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో కోరి,రెండుసార్లు కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నాం.మళ్లీ అలాంటిది జరగదు'' అని కూడా ఆయన అన్నారు. ఆయన వ్యాఖ్యల వెనుక సీఎంగా తనకున్న సమాచారం,బిఆర్ఎస్ నాయకుల కదలికల వ్యవహారంపై అందిన 'ఇన్ పుట్స్' కారణం కావచ్చు. సోమవారం నాడు తెలంగాణలో నాలుగైదు ప్రాంతాల్లో జరిగిన ఘటనలు పలు అనుమానాలకు ఆస్కారం కలిగిస్తున్నాయి.మాజీ సర్పంచుల ఆందోళనలు,ఆటో డ్రైవర్ల ఉద్యమాలు.. ఇతర అంశాలు ఒక ఎత్తు.వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై రాళ్లతో జరిగిన దాడి మరో ఎత్తు! ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూసేకరణ విషయంలో జిల్లా కలెక్టర్ వెళ్ళినప్పుడు దాడి చేయడం కాకతాళీయం కాకపోవచ్చు.



**సోమవారం నాడు తెలంగాణలో నాలుగైదు ప్రాంతాల్లో జరిగిన ఘటనలు పలు అనుమానాలకు ఆస్కారం కలిగిస్తున్నాయి. మాజీ సర్పంచుల ఆందోళనలు,ఆటో డ్రైవర్ల ఉద్యమాలు.. ఇతర అంశాలు ఒక ఎత్తు.వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై రాళ్లతో జరిగిన దాడి మరో ఎత్తు! ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూసేకరణ విషయంలో జిల్లా కలెక్టర్ వెళ్ళినప్పుడు దాడి చేయడం కాకతాళీయం కాకపోవచ్చు. కొన్ని రాజకీయ శక్తుల,సంఘ విద్రోహులు,రేవంత్ రెడ్డి వ్యతిరేక మనుషుల ప్రణాళిక రచనో,సహకారమో,ప్రోత్సాహమో,రెచ్చగొట్టడమో జరగకపోతే ప్రజలు స్వచ్ఛందంగా రాళ్లతో దాడికి పాల్పడతారని భావించడం కష్టం.ఈ ఘటనలన్నింటినీ వేర్వేరుగా చూడడానికి వీలు లేదు.వీటన్నింటినీ ఒక దారంతో కలిపి చూస్తే భారీ ప్రణాళిక,అంతకు మించిన కుట్ర కూడా కనబడే అవకాశాలు తోసిపుచ్చలేం.**

కొన్ని రాజకీయ శక్తుల,సంఘ విద్రోహులు,రేవంత్ రెడ్డి వ్యతిరేక మనుషుల ప్రణాళిక రచనో,సహకారమో, ప్రోత్సాహమో,రెచ్చగొట్టడమో జరగకపోతే ప్రజలు స్వచ్ఛందంగా రాళ్లతో దాడికి పాల్పడతారని భావించడం కష్టం.ఈ ఘటనలన్నింటినీ వేర్వేరుగా చూడడానికి వీలు లేదు.వీటన్నింటినీ ఒక దారంతో కలిపి చూస్తే భారీ ప్రణాళిక,అంతకు మించిన కుట్ర కూడా కనబడే అవకాశాలు తోసిపుచ్చలేం. ఫ్యాప్సికం,టమాటా,ఆలుగడ్డ,కొత్తిమీర వంటి పంటలు పండే పొలాల్లో 'అశాంతి', 'అలజడి'కి సంబంధించిన ప్లానింగ్ కూడా జరుగుతున్నదేమో? ఎవరు చూశారు? కాగా ''ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి,ఆగ్రహం చాలాచోట్ల కట్టలు తెంచుకుంటోంది. అది ఈ అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని త్వరలోనే భూస్థాపితం చేయనుంది'' అంటూ వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై దాడిని సమర్థిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు.

''రాష్ట్రంలో పరిపాలనా వైఫల్యం,శాంతిభద్రతల వైఫల్యానికి తాజా ఉదాహరణ రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో జిల్లా కలెక్టర్ మీదనే రైతులు తిరుగుబాటు చేశారు.ముఖ్యమంత్రి మూర్ఖత్వం వల్ల అధికారులు దెబ్బలు తినాల్సి వచ్చింది. భూసేకరణ పూర్తయ్యి,అన్ని అనుమతులు వచ్చి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఫార్మా సిటీని రద్దు చేసి,రాష్ట్రంలో పది చోట్ల ఫార్మా క్లస్టర్లు పెట్టాలనే తుగ్లక్ ఆలోచన వల్లనే ఇంత అలజడి రేగింది'' అని ఢిల్లీలో ఉన్న కేటీఆర్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.తమ హయాంలో చేపట్టిన ఫార్మాసిటీని కొనసాగించాలని,10 ఫార్మా క్లస్టర్ల ఏర్పాటు ప్రతిపాదన మూర్ఖత్వమన్నది కేటీఆర్ వాదన. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం,లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ భూసేకరణ ప్రక్రియలో భాగంగా గ్రామసభలో ప్రజాభిప్రాయానికి వెళ్ళినప్పుడు ఈ దాడి సంఘటన జరిగింది. ఇలాంటి దాడులతో ఉద్యోగులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని ఉద్యోగుల సంఘాలు కోరుతున్నవి. రాష్ట్ర డీజీపీ దృష్టికి తీసుకెళ్ళి,దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు,భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు రమేష్.పాక తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్,కడా ప్రత్యేక అధికారి ప్రతీక్ జైన్ సహా,తహశీల్దార్,ఇతర అధికారులపై దాడి అరాచకమైన చర్య అని తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ ఖండించింది.దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సంఘం డిమాండు చేసింది. అధికారుల బృందంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.రాములు,రమేష్‌పాక,సెక్రటరీ జనరల్ ఫూల్ సింగ్ చౌహాన్ అన్నారు.

''గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దాడి జరిగింది. అధికారులపై దాడికి ఉసిగొల్పిన,దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి'' అని వారు కోరారు. కేసీఆర్ మినహా 'తెలంగాణ'ను బాగా నమిలి, మింగేసిన వ్యక్తి మనకు కనిపించరు.తెలంగాణ ప్రజల అమాయక మనస్తత్వం, ఆలోచన, ఆవేశం,వ్యవహార శైలి,బలహీనతలను, బలాన్ని దాదాపు నలభై ఏండ్లుగా ఆయన అధ్యయనం చేశారు.ఆయనకు తెలిసినంతగా ఈ భూమ్మీద తెలంగాణ లక్షణం గురించి తెలిసిన వ్యక్తి మరొకరు లేరు.రాష్ట్రం ఏర్పడితే ఏమి చెయ్యాలి.తాము అధికారంలోకి వస్తే ఏమి చెయ్యాలి?అధికారాన్ని ఎట్లా దుర్వినియోగం చెయ్యాలి?అధికార దుర్వినియోగంతో సంపదను ఎట్లా కూడబెట్టుకోవాలి? తన తదనంతరం కూడా పలు తరాల తన కుటుంబ సభ్యులు కాలు కదపకుండా ఎట్లా జీవించాలి? విలాసాలు,భోగాలు ఎట్లా అనుభవించాలి? వీటన్నింటిపై కేసీఆర్ కు సాధికారికంగా అవగాహన ఉన్నది. అధికారంలోకి రాగానే మొత్తం అణచివేతకు ఎట్లా రంగం సిద్ధం చేశారో వెంటనే అర్థం కాలేదు. కేసీఆర్ ను వ్యతిరేకించిన వాళ్ళు,బిఆర్ఎస్ పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారందరినీ తెలంగాణ ద్రోహులుగా ముద్ర వేసి ప్రజల ముందు దోషులుగా నిలబెట్టే పనులు కేసీఆర్ చేశారు. కేటీఆర్,హరీశ్ రావు సైతం అదే ఫార్ములాను ఫాలో అయ్యారు. నిజానికి ఉద్యమ ద్రోహులయిన వాళ్ళను పిలిచి మరీ మంత్రి పదవులు ఇచ్చారు. ఆ నిర్ణయాలను ప్రశ్నిస్తే, మీ మొఖం మీకేం తెలుసు,పరిపాలన వాళ్లకే తెలుసు. మీకు గాయగత్తర మాత్రమే తెలుసు అని బిఆర్ఎస్ అధ్యక్షుడు అన్న మాటలు తెలంగాణ సమాజం ముందు ఉన్నవే. ఉద్యమంలో తెలంగాణ బిడ్డలపై లాఠీలతో విరుచుకుపడ్డ పోలీసు ఉన్నతాధికారులకు ప్రమోషన్లు ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల పట్ల అత్యంత దారుణంగా ప్రవర్తించిన పోలీసు అధికారులను అందలం ఎక్కించారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయడం వాళ్లకే తెలుసు అని మిగతా వాళ్ళ నోళ్లు మూయించారు.కాంట్రాక్టులను కోస్తా ఆంధ్రాకు చెందిన మేఘా కృష్ణారెడ్డికి,పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి లాంటి వాళ్లకు కట్టబెట్టినప్పుడు తెలంగాణలో ప్రాజెక్టులు కట్టే మొఖాలు ఉన్నాయా అని ఎదురుదాడి చేసినట్టు కొందరు గుర్తు చేస్తున్నారు. ఆంధ్రా బాపనోళ్లు ఆడంబరం గాళ్లు,తెలంగాణ బాపనోళ్లు నిష్ఠ గలోళ్లు అన్న కేసీఆర్,చిన జీయర్ స్వామిని ముఖ్యమంతి సీటులో కూర్చొబెట్టి, కాళ్లు మొక్కిన సంగతిని తరచూ చాలా మంది గుర్తుచేస్తుంటారు. తెలంగాణ యువత బర్లు,గొర్లు కాసుకోవడానికి తప్ప దేనికీ పనికి రారు అని కేసీఆర్ పరోక్షంగా సందేశం ఇచ్చారు. ''గొంతెత్తినోడిని నొక్కు నొక్కిండు.సంఘాలు ఎందుకు నేనే సంఘం అన్నడు.ధర్నాలు కుదరదు ధర్నాచౌక్ రద్దు అన్నాడు. ఖాళీగా ఉంచితే గొడవలు చేస్తారని, గంజాయిని ప్రయోగించిండు అని ఒక మిత్రుడు ఇటీవల సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. ''మొత్తం తెలంగాణను చడీచప్పుడు లేకుండా చేసిండు'' అని అతను ముగించాడు. అంటే దాదాపు పదేండ్ల పాటు తెలంగాణలో ఒక విధమైన 'స్మశాన నిశ్శబ్దం' కొనసాగేలా కేసీఆర్,కేటీఆర్,హరీశ్ రావు ప్రయత్నించినట్టు ఆరోపణలున్నవి. ఘంటా చక్రపాణి,అల్లం నారాయణ, నందిని సిధారెడ్డి... వంటి వామపక్ష మేధావులు,విద్యావంతులు,ప్రజాస్వామిక వాదులు,ప్రశ్నించే వాళ్ళకు పదవులు ఇచ్చి మచ్చిక చేసుకున్నారు.అలాంటి వారు మాట్లాకుండా,పత్రికల్లో రచనలు చేయకుండా కట్టడి చేయగలిగారు.తమ పాలన పట్ల భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడం,నిర్మాణాత్మక విమర్శలు చేయడం కూడా 'నేరం'గా కేసీఆర్ భావించేవారన్న విమర్శలున్నవి. కేసీఆర్ వ్యూహాత్మకంగా పరిపాలన సాగించారనడానికి అనేక ఉదాహణలున్నవి. పైగా డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి 'అణచివేత చర్యల' వల్ల మావోయిస్టులు ఛత్తీస్ గడ్,జార్ఖండ్,ఒడిశా వంటి రాష్ట్రాలకు తరలిపోవడం కేసీఆర్ కు అంది వచ్చిన వరం.ఒక వేళ మావోయిస్టుల కార్యకలాపాలు తెలంగాణలో ఉంది ఉంటే ఎన్ని బూటకపు ఎన్ కౌంటర్లు జరిగేవో,ఎంత రక్తం చిందేదో తెలియదు.ఇటీవలే నిరుద్యోగ యువత అశోక్ నగర్ నుంచి సెక్రటేరియేట్ దాకా రాగలిగారు.ధర్నా చేయగలిగారు.ఇలాంటి దృశ్యం కేసీఆర్ పాలనలో ఏనాడయినా చూశామా?రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కొన్ని విషయాల్లో ఉదాసీనంగా ఉండడమో,నిరుద్యోగుల పట్ల సానుభూతి ఉండడమో కారణం కావచ్చు. నిరసన ప్రదర్శనలు,ధర్నాలు,ఆందోళన కార్యకార్యక్రమాలు సాగుతున్నవి.అయితే ఇవన్నీ ఒక దశ వరకే. ఇది హద్దు మీరితే రేవంత్ ప్రభుత్వానికి కూడా 'బలప్రయోగం' చేయవలసిన అనివార్య పరిస్థితి తలెత్తవచ్చు. .''తెలంగాణ సమాజంపై ఎందుకింత కోపం''? అని కేసీఆర్ ను పలు సందర్భాలలో సీఎం.రేవంత్ నిలదీశారు.నిజమే! కేసీఆర్ హయాంలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకపోయినా,ఉద్యోగాల నోటిఫికేషన్లు వేయకపోయినా,ఉద్యోగుల మూడు డీఏలు పెండింగులో పెట్టినా,తమను వ్యతిరేకించినవారిపై కేసులు పెట్టి జైలుకు పంపినా దాన్నే 'స్వర్ణయుగం'గా ప్రచారం చేశారు.'అడిగినా,అడగకపోయినా ఎన్నో రకాలుగా ప్రజల కోరికలు తీర్చినట్టు' గత శనివారం ఫార్మ్ హౌజ్ లో పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ కేసీఆర్ అన్నారు.అలాంటి 'ధర్మప్రభువు'నైన తనను ఓడించడమేమిటి అనే ఆగ్రహం కేసీఆర్ కు రావడంలో తప్పేముంది? ఈ ప్రభుత్వం పనయిపోయిందనో,ఇక ఎంతో కాలం రేవంత్ రెడ్డి సీఎంగా ఉండజాలరనో, ప్రభుత్వం కూలిపోతుందనో.. రకరకాల ప్రకటనలు బిఆర్ఎస్ వైపు నుంచి వస్తున్నవి. ఆ ప్రకటనల వెనుక ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం త్వరగా పడిపోవాలని కేసీఆర్ కోరుకుంటున్నట్టుగా భావించడంలో తప్పేమీ లేదు.అందువల్ల 'తెలంగాణలో అలజడి సృష్టించాలి. అశాంతి ఏర్పడాలి.శాంతి భద్రతల సమస్యలు నెలకొనాలి.ప్రభుత్వం శాంతి భద్రతలలో విఫలమైనట్టు నిరూపించాలి'. వంటి ప్లానింగ్ జరుగుతున్నట్టు అనుమానాలు కలుగుతున్నవి.



- ఎస్కే జకీర్,
సీనియర్ జర్నలిస్ట్

## పతన స్థాయి నుంచి పతాక స్థాయికి
## అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత

- బడ్జెట్ కేటాయింపులతో పోలీస్ శాఖకు పూర్వ వైభవం
- 2024 - 25 బడ్జెట్ లో పోలీస్ శాఖకు రూ.8.495 కోట్లు
- బడ్జెట్ పై ఏపీ హోం మంత్రి అనిత



బడ్జెట్ కేటాయింపులతో పోలీస్ శాఖకు పూర్వవైభవం తెస్తాం: హోంమంత్రి అనిత

**అమరావతి, మహా :** ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన విధ్వంసంతో పతన స్థాయికి తిరోగమించిన ఆంధ్రప్రదేశ్ ను తిరిగి పతాక స్థాయికి చేర్చే విధంగా 2024 25 బడ్జెట్ ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత లభించిందన్నారు. రూ.2.94 లక్షల కోట్ల బడ్జెట్ లో ప్రతి రంగానికి సమపాళ్లలో కేటాయింపులు జరిగాయన్నారు. అభివృద్ధికి పెద్ద పీట వేస్తూనే వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం సుమారు 23 శాతం బడ్జెట్ నిధులు కేటాయింపుతో ఆయా వర్గాలను అభివృద్ధిలో భాగస్వాములను చేయడమేనన్నారు. రాష్ట్ర జీఎస్డీపీలో 40 శాతానికి పైగా వాటా ఉన్న వ్యవసాయం అనుబంధ రంగాలకు రూ.43,402 కోట్లు కేటాయించి రైతు సంక్షేమ ప్రభుత్వం అన్న పేరుకు సార్థకత చేకూరిందన్నారు. విద్య, వైద్య, ఇరిగేషన్, పంచాయతీరాజ్, నైపుణ్య రంగంతో పాటు గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధితో పాటు రాష్ట్ర రాహదారుల కోసం సింహభాగం ఖర్చు చేయాలని భావించడం సీఎం దార్శనికతకు నిదర్శనమన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అథోగతి పాలు చేసిన వైఎస్సార్సీపీ నేతలు ఇప్పుడు మొహం చాటేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఎంతో కీలకమైన బడ్జెట్ సమావేశాలకు కూడా రాకుండా తమ భాద్యతా రాహిత్యాన్ని బహిర్గతం చేశారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పోలీస్ శాఖకు 2024 25 బడ్జెట్ లో రూ.8,495 కోట్లు కేటాయించారన్నారు. గత ప్రభుత్వ పాలనలో అర కొర సౌకర్యాలతో పోలీసులు ఎన్నో కష్టాలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలీస్ శాఖలో ప్రక్షాళన చేపట్టిందన్నారు. పోలీసు బలగాల ఆధునీకరణ, మౌలిక వసతుల కోసం ఇప్పటికే రూ. 62 కోట్లు నిధులు విడుదలయ్యాయన్నారు. శ్రీకాకుళం, చిత్తూరు, ప్రకాశం, రాజమహేంద్రవరంలో కొత్తగా 4 స్పెషల్ పోలీస్ బెటాలియన్లు ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని పట్టి పీడించిన మాదకద్రవ్యాలను రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. అందుకే యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేశామన్నారు. డ్రగ్స్ కేసుల సత్వర పరిష్కారానికి 13 ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. విద్యార్థులను మత్తుకు బానిసలు కాకుండా ఉంచేందుకు ఉన్నత విద్యాసంస్థల్లో 3,172 యూనిట్లకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

## ఢిల్లీలో అడుగుపెట్టా హైదరాబాద్‌లో ప్రకంపనలు

**ఢిల్లీ, మహా:** ఢిల్లీలో అడుగు పెట్టా.. హైదరాబాద్‌లో అప్పుడే వణికిపోతే ఎలా?.. హైదరాబాద్‌లో ప్రకంపనలు కనిపిస్తున్నాయి అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ లో పోస్ట్ చేశారు. సోమవారం ఢిల్లీ వెళ్ళిన కేటీఆర్ అమృత్ పథకం టెండర్లలో స్కామ్ జరిగిందని కేంద్రానికి ఫిర్యాదుచేశారు. అమృత్ టెండర్లలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సోమవారం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను ఢిల్లీలో కేటీఆర్ కలిసి ఈ పనులపై విచారణ జరపాలని ఫిర్యాదు చేశారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే నిబంధనను ఉల్లంఘించి తన బావమరిది సుజన్ రెడ్డికి చెందిన శోధా కంపెనీకి రూ. 1,137 కోట్ల విలువ చేసే పనులను అప్పగించారని ధ్వజమెత్తారు. ఏమాత్రం అనుభవం, అర్హత లేని సంస్థకు కేవలం తన బావమరిది కంపెనీ అన్న ఓకే ఒక్క కారణంతో ఇంత పెద్ద ఎత్తున పనులను కట్టబెట్టారని చెప్పారు. మొత్తం వ్యవహారంలో ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే నిబంధనను ఉల్లంఘించారని ఈ టెండర్లపై విచారణ జరిపించాలని కేంద్రమంత్రికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో ముగిసిన ఐటీ సోదాలు

**సోదాలపై స్పందించని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్**

**భీమవరం, మహా :**
గడచిన ఐదు రోజులుగా భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇంట్లో కొనసాగిన ఐటీ అధికారుల సోదాలు ఆదివారం అర్ధరాత్రి ముగిశాయి. ఐదు రోజులు పాటు మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తో పాటు ఆయన వ్యాపార భాగస్వాముల ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. సోదాలకు సంబంధించిన విషయాలను ఆదాయపు పన్ను శాఖ అధికారులు బహిర్గత చేయలేదు. సోదాలు జరిగిన ఐదు రోజులూ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇంటికే పరిమితమయ్యారు. అయితే సోదాలపై గ్రంధి శ్రీనివాస్ స్పందించలేదు. ఐటీ సోదాల నేపథ్యంలో సోషల్ మీడియాలో కూడా గ్రంధి శ్రీనివాస్ అందుబాటులో లేరు. అసలు ఐదు రోజులపాటు గ్రంధి శ్రీనివాస్ ఇంట్లో ఐటీ అధికారులు ఏం చేశారు అనేదానిపై రాని స్పష్టత రాలేదు.

## రాష్ట్రంలో 13 మంది ఐఏఎస్‌లు బదిలీ

**జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి**

**మహా, హైదరాబాద్ :**
రాష్ట్రంలో మళ్లీ ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. ఈ సారి 13 మంది ఐఏఎస్ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పర్యాటకం, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శిగా స్మితా సబర్వాల్ నియామకం అయ్యారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శిగా స్మితా సబర్వాల్ అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఇ. శ్రీధర్, దేవాదాయ శాఖ కమిషనర్‌గా శ్రీధర్‌కే అదనపు బాధ్యతలు అప్పగించారు. మహిళ, శిశు సంక్షేమం, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా అనితా రామచంద్రన్, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబరితి, రవాణా శాఖ కమిషనర్‌గా కే సురేంద్ర మోహన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా సీహెచ్ హరికిరణ్, ట్రాన్స్ కో సీఎండీగా కృష్ణ భాస్కర్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కూడా కృష్ణ భాస్కర్ కొనసాగనున్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోగా శివశంకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి డైరెక్టర్‌గా సృజన నియామకం అయ్యారు.

# అట్టడుగు వర్గాల ప్రయోజనాలకు ఆటంకంగా బీఆర్ఎస్

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ తప్పుడు ప్రచారంపై పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసారు. అట్టడుగు వర్గాల ప్రయోజనాలకు ఆటంకంగా బీఆర్ఎస్ మారిందని, అందుకే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు బీఆర్ఎస్ అడ్డుపడుతుందని ఫైర్ అయ్యారు. సచివాలయంలో తనను కలసిన మీడియా ప్రతినిధులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ, తెలంగాణలో అమలవుతున్న పథకాలు, మహారాష్ట్ర ఎన్నికలు, కుల గణన వంటి అంశాలను ప్రస్తావించారు. కుల గణన కోసం వచ్చే అధికారులను నిలదీయాలని కేటీఆర్ పిలుపు ఇవ్వడాన్ని మంత్రి సీతక్క తప్పుబట్టారు. కులగణనను అడ్డుకునేలా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ ను బీసీ సంఘాలు నిలదీయాలని విజ్ఞప్తి చేసారు. కులగణనకు అడ్డుపడుతున్న బీఆర్ఎస్ వైఖరిని కుల సంఘాలు ఎండగట్టాలని కోరారు. కుల గణనను అడ్డుకుంటే బీసీ ద్రోహిగా బీఆర్ఎస్ మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. విదేశాల నుంచి రప్పించి మరీ బీఆర్ఎస్ కుటుంబ సర్వే చేసి ప్రజలకు నయా పైసా ప్రయోజనం చేయలేదన్నారు. సామాజిక వర్గాల వారిగా జనాభా లెక్క తేలితేనే సంక్షేమ వాటా సాధ్యమవుతుందన్నారు. తాము చేపట్టిన ఇంటింగి సమగ్ర సర్వేను బహిష్కరించడం అంటే తమ హక్కులను, అభివృద్ధిని వదులుకోవడమే అవుతుందన్నారు సీతక్క. మేమెంతో మాకంత అన్న నినాదం నిజం కావాలంటే సమగ్ర సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

క్లబ్బులు, పబ్బులు బంద్ అయ్యాక కొందరు నేతలు అరాచకంగా తయారయ్యారని, విజ్ఞత లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని సీతక్క మండిపడ్డారు. బీఆర్ఎస్ చెప్పుడు మాటలు నమ్మకుండా గత పదేండ్లలో జరిగిన నష్టాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి, ఎంత రుణ మాఫీ జరిగిందో ఆలోచించాలన్నారు. అట్టడుగు వర్గాలకు అందబోయే ప్రయోజనాలను అడ్డుకునేందుకే బీఆర్ఎస్ ఇంటింటి సర్వేను వ్యతిరేకిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క కేసీఆర్ కుటుంబానికి తప్ప ఏవరికీ లబ్ది జరగకూడదనే ఉద్దేశంతోనే ఇంటింటి సర్వేను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని సీతక్క మండిపడ్డారు. ఇంటింటి సర్వే వద్దనుకుంటే ఎవరికి నష్టమో ప్రజలు ఆలోచించుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. మహారాష్ట్రలో బీజేపీకి లబ్ది చేకూర్చేందుకు బీఆర్ఎస్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని ఫైర్ అయ్యారు. కేసులు నుంచి తప్పించుకునేందుకు బీజేపీకి బీ టీం గా బీఆర్ఎస్ పనిచేస్తోందన్నారు. మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పక్కా ప్రణాళికతో బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. అత్యవసర సమయాల్లో చేతిలో చిల్లి గవ్వ లేకున్నా మహిళలు ఉచిత ప్రయాణాలు చేస్తున్నారని మంత్రి సీతక్క గుర్తు చేసారు. ఉచిత రవాణ పథకంపై దుష్ప్రచారం చేస్తూ ఆటో డ్రైవర్లను ఉసిగొల్పి ధర్నాలు చేయిస్తుందని తెలిపారు. ఓలా, ఉబర్ క్యాబ్ లు, బైక్ టాక్సీలకు ప్రగతి భవన్ లో పచ్చ జెండాలు ఊపి ప్రారంభించినప్పుడు ఆటో డ్రైవర్లు గుర్తుకు రాలేదా అని కేటీఆర్ ను ప్రశ్నించారు. కోట్లాదిమంది మహిళలకు అన్యాయం చేసేలా బీఆర్ఎస్ కుట్రలుల పన్నుతోందని ఫైర్ అయ్యారు.

**బీఆర్ఎస్ వైఖరిని బీసీ సంఘాలు నిలదీయాలి**

**బీజేపీ బీ టీంగా కేసీఆర్ అండ్ కో.. అందుకే ప్రజా ప్రభుత్వంపై తప్పడు ప్రచారం**

**ధర్నా చౌక్ ఎత్తేసిన వాళ్లే ధర్నాలకు దిగుతున్నారు**

**అప్పుడు అణచి వేత..ఇప్పుడు అవాస్తవాలు.. ఎంత ఉప్పు తింటే అంత దూప**

**బీఆర్ఎస్ చేసిన అప్పులూ వడ్డీలకే రూ. 54 వేల కోట్లు**

**సామాజిక న్యాయాన్ని, లౌకిక వాదాన్ని నిలబెట్టేందుకే ఎన్నికల ప్రచారం**


**బీఆర్ఎస్ పై మంత్రి సీతక్క ఫైర్**



లక్ష రూపాయలు కూడా పంట రుణమాఫీ చేయని బీఆర్ఎస్ ఇప్పుడు రైతులపై ప్రేమ కురిపించడం విడ్డూరంగా ఉందని సీతక్క ఎద్దేవ చేసారు. బీఆర్ఎస్ హాయంలో 20 లక్షల మంది రైతులకు పైసా రుణమాఫీ కాలేదని గుర్తు చేసారు. విడతల వారిగా చేసిన రుణ మాఫీ వడ్డీలకు కూడా సరిపోలేదన్నారు. కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం.. కేవలం 27 రోజుల్లోనే 18 వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేసిందన్నారు. గత ప్రభుత్వం రుణ మాఫీ చేయకపోవడంతో ఎంతో మంది రైతులను బ్యాంకులు బ్లాక్ లిస్టు లో చేర్చడం, పలు సాంకేతిక సమస్యల కారణంగా మిగిలిన రైతులకు రుణ మాఫీ ఆలస్యమవుతోందన్నారు. అయితే ఏక కాలంలో తాము పంట రుణ మాఫీ చేస్తుంటే బీఆర్ఎస్ సహించలేక అవాస్తవాలు ప్రచారం చేస్తుందన్నారు. తెలంగాణ లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నట్లు సీతక్క తెలిపారు. సామాన్యుల గృహాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న ఆలోచన బీఆర్ఎస్ చేయలేదని, తాము మాత్రం 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తూ వారిని ఆర్థికతంగా బలోపేతం చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్, దాని మిత్రపక్షం బీజేపీలు కలిసి రూ. 400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1200కి పెంచగా..తమ ప్రభుత్వం పేదల వంటింటి భారాన్ని తగ్గించేందుకు రూ. 500 కే సిలిండర్ అందిస్తున్నామన్నారు. పదేళ్లలో లక్ష ఉద్యోగాలు సైతం బీఆర్ఎస్ ఇవ్వకపోతే.. తాము కేవలం ఆరు మాసాల్లోనే 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఐదేళ్ళ కాలం కోసం ప్రజలు తమను ఎన్నుకున్నారని, ఈ ఐదేళ్ళలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. గూడు లేని పేదలకు కాంగ్రెస్ గత ప్రభుత్వాలు లక్షల ఇండ్లు ఇచ్చాయని అదే తరహాలో ఇప్పుడు కూడా రూ. 5 లక్షలతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందన్నారు.

## మహేశ్ బాబు-రాజమౌళి సినిమా వసూళ్ళు 3 వేల కోట్లు దాటుతాయ్

- భారత సినీరంగంలోనే అదో పెద్ద చరిత్ర అవుతుంది
- తమ్మారెడ్డి భరద్వాజ సంచలన కామెంట్స్



దర్శకధీరుడు రాజమౌళి డైరెక్షన్‌లో టాలీవుడ్ ప్రిన్స్ మహేశ్ బాబు హీరోగా 'ఎస్ఎస్ఎంబీ 29' సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ క్రేజీ ప్రాజెక్టుపై దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్ట్ తర్వాత ప్రపంచమంతా తెలుగు సినిమా గురించే మాట్లాడుకుంటుందని, తెలుగు సినిమా ఎవరూ ఊహించని స్థాయికి ఎదుగుతుందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ బడ్జెట్ కచ్చితంగా రూ.1000 కోట్లు దాటవచ్చని భరద్వాజ అంచనా వేశారు. బాహుబలి సినిమా విడుదలయ్యాక తెలుగు సినిమా స్థాయి పెరిగిందని, రూ.100 కోట్ల సినిమా అంటే సాధారణ అంశంలా మారిపోయిందని అన్నారు. ఇక ఎన్టీఆర్‌రామ్‌చరణ్ ప్రధాన పాత్రల్లో వచ్చిన ఆర్ఆర్ఆర్ తర్వాత రూ.300 కోట్లు చిన్న బడ్జెట్‌గా కనిపిస్తోందని, ప్రస్తుతం మహేశ్ సినిమా వచ్చాక రూ.500 కోట్లు సాధారణ విషయంలా అనిపిస్తోందని చెప్పారు.

**వసూళ్లు రూ.3-4 వేల కోట్లు ఉండొచ్చు**

ఈ సినిమా కనీసం రూ.2 వేల కోట్ల బిజినెస్ జరుపుతుందని తమ్మారెడ్డి భరద్వాజ అంచనా వేశారు. వసూళ్లు రూ.34 వేల కోట్ల వరకు రావొచ్చని అన్నారు. ఈ సినిమాలో అంతర్జాతీయ స్థాయి నటులు నటిస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తును రాజమౌళి చాలా బాగా ఊహిస్తారని, 'ఎస్ఎస్ఎంబ29' ద్వారా మరోసారి ఆయన సత్తా చాటనున్నారని అన్నారు. ఈ ప్రాజెక్ట్ బిజినెస్ ఊహించడం కూడా కష్టమని, రూ.34 వేల కోట్ల వసూలు చేస్తే భారతదేశ సినీరంగంలోనే చరిత్ర అవుతుందని భరద్వాజ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 'ఎస్ఎస్ఎంబీ29' తర్వాత తెలుగు సినిమా పరిశ్రమ మరింత ఎత్తుకు ఎదగాలని తాను కోరుకుంటున్నానని ఆయన అభిలషించారు. ఈ మేరకు ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియా మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కాగా 'ఎస్ఎస్ఎంబీ29' ప్రాజెక్ట్‌లొకేషన్ల కోసం దర్శకుడు రాజమౌళి అన్వేషిస్తున్న విషయం తెలిసిందే

# 30 ఏళ్లుగా సంకీర్ణ ప్రభుత్వాలే

మహారాష్ట్రలో విభిన్న రాజకీయాలు

మహారాష్ట్రలో గత మూడుదశాబ్దాలుగా సంకీర్ణ ప్రభుత్వాలే రాజ్యమేలుతున్నాయి. ఈ రాష్ట్ర ప్రజలు ఏకపక్షంగా ఏ పార్టీని నెత్తిన పెట్టుకోవడం లేదు. ముఖ్యంగా మహారాష్ట్రలోని ఆరు ప్రాంతాల్లో ఆరు విభిన్న తరహా రాజకీయాలు ఉండడమే ఇందుకు కారణం. ప్రస్తుతం కూడా మహాయుతి కూటమి తరుపున మూడుపార్టీలు బిజెపి, ఏక్ నాథ్ షిండే, అజిత్ పవార్ పార్టీలు కలిసి పోటీచేస్తుండగా, కాంగ్రెస్ కూటమిలోనూ మూడుపార్టీలున్నాయి. ఉద్ధవ్ థాకరే, శరద్ పవార్ ల తో కలిసి కాంగ్రెస్ పోటీచేస్తోంది. ఆరుపార్టీలు.. ఆరుప్రాంతాలు ఒక్క ఫలితం.. ఒక్క పీఠం కోసం ఉత్కంఠగా పోరాడుతున్నాయి. ఈ దఫా కూడా సంకీర్ణప్రభుత్వమే ఏర్పడనుంది. అది ముందుగానే డిసైడ్ అయింది. ఏ పార్టీ పూర్తిస్థాయి సీట్లలో పోటీచేయలేకపోవడమే ఇందుకు నిదర్శనం. ఈ సంక్లిష్టత ఈ నాటిది కాదు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 20న జరగనున్న విషయం తెలిసిందే. ఎన్నికల ఫలితాలు నవంబర్ 23న వెలువడుతాయి. మహారాష్ట్రలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయన్నది ఎంత ఆసక్తికరంగా ఉంటుందో.. ఏ కూటమికి ఎన్ని సీట్లు వస్తాయన్నదీ అంతే ఆసక్తికరంగా మారుతుంది.

## థర్టీ ఇయర్స్ పొలిటికల్ ఇండస్ట్రీ

రాష్ట్రంలో దాదాపు 30 ఏళ్లుగా సింగిల్ పార్టీ ఇప్పటివరకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. అంటే 1995 నుంచి ఇప్పటివరకు ఆ రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాలే అధికారంలో ఉంటున్నాయి. సింగిల్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం గగనంగా మారింది. పొత్తు లేకుండా సర్కారును ఏర్పాటు చేయలేకపోతున్న పార్టీలు ఈ సారి కూడా పొత్తులనే నమ్ముకున్నాయి. కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్రలో 1990లో సింగిల్‌గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పొత్తులు అవసరం లేనంత మెజార్టీ ఆ పార్టీకి వచ్చింది. మహారాష్ట్రలో 1990లో కాంగ్రెస్ పార్టీ 141 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ ఎన్నికల్లో బీజేపీ 42, శివసేన 52 సీట్లు గెలుచుకున్నాయి.



## 1995 నుంచి ఇప్పటిదాకా..

శివసేనకు 1995 ఎన్నికల్లో 73, బీజేపీకి 65 సీట్లు దక్కాయి. ఆ రెండు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వాలే ఉన్నాయి. మహారాష్ట్రలో మొట్టమొదటి సంకీర్ణ ప్రభుత్వం ఇది కాదు. అంతకు ముందు 1978లో కాంగ్రెస్ (ఓ), కాంగ్రెస్ (ఇందిర) కలిసి ఎమర్జెన్సీ తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.

■ బాల్ థాకరే స్థాపించిన శివసేన 1972లో ఒక సీటు గెలుచుకోవడం ద్వారా అసెంబ్లీలోకి అరంగేట్రం చేసింది. ఇక 1978 తర్వాత 1980లో 'ఇందిరా కాంగ్రెస్' 186 సీట్లు గెలుచుకుని మళ్లీ అధికారంలోకి వచ్చింది. 1995లో శివసేనబీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో 45 మంది కాంగ్రెస్ తిరుగుబాటుదారులు స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచి కాషాయ పాలనకు మద్దతు ఇవ్వడంతో ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం ముగిసింది. 1999 అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్‌లో చీలిక వచ్చి శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటైంది.

■ అప్పట్లో కాంగ్రెస్ పార్టీ 75 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించగా, ఎన్సీపీ 58 స్థానాలను గెలుచుకుంది. అధికార శివసేన 69, బీజేపీ 56 స్థానాలు గెలుచుకుని అధికారాన్ని కోల్పోయాయి. కాంగ్రెస్, ఎన్సీపీలు వేర్వేరుగా ఎన్నికల్లో పోటీ చేసినా ప్రభుత్వ ఏర్పాటుకు ఒక్కటయ్యాయి. ఆ తర్వాత 15 ఏళ్ల పాటు కూటమి పాలించింది. 2014లో నాలుగు పార్టీలు విడివిడిగా పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో బీజేపీకి 122, శివసేనకు 63, కాంగ్రెస్‌కు 42, ఎన్సిపికి 41 సీట్లు వచ్చాయి. శివసేన ఏర్పాటైన నెల తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వంలో చేరింది. 2019 ఎన్నికల్లో బీజేపీ, శివసేన కలిసి పోటీ చేశాయి. బీజేపీ 105, శివసేన 56 స్థానాల్లో గెలుపొందడంతో, కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్న సమయంలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన ముఖ్యమంత్రి పదవి కోసం పట్టుబట్టడంతో ఇరు పార్టీలు విడిపోయాయి. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గంతో కలిసి శివసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సంఖ్యాబలం లేకపోవడంతో అది మూడు రోజుల్లోనే కూలిపోయింది. దీంతో కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి శివసేన మహా వికాస్ అఘాడీ ఏర్పాటు చేసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ 44, ఎన్సీపీ 54 సీట్లు గెలుచుకున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మూడు పార్టీల ప్రభుత్వం జూన్ 2022 వరకు కొనసాగింది. ఆ సమయంలో శివసేన నాయకుడు ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని పడగొట్టారు. షిండే సేనను చీల్చి బీజేపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రభుత్వం ఇప్పటిదాకా కొనసాగుతోంది. అజిత్ పవార్ తో ఎన్సీపీని కూడా లాక్కుని షిండేతో ముడివేశారు. మహాపాలిటిక్స్ లో ఈ ఎన్నికలు మహా మలుపు కాబోతున్నాయన్నది మాత్రం నిజం. దేశ రాజకీయాలను కూడా ఈ మహా ఎన్నికలు ప్రభావితం చేయనున్నాయి.

**- మహా డెస్క్**



యుద్ధం
ఎప్పుడూ
కఠినంగానే ఉంటుంది.
సత్య కాలమైనా.. సత్యా కాలమైనా.
అప్పుడూ ఇప్పుడూ విజయానికి శక్తి
ఒక్కటే చాలదు, యుక్తి కూడా ఉండి తీరాల్సిందే. గెలుపు
పొందాలంటే ఎంత శ్రద్ధతో శ్రమించి పనిచేస్తామో అంతే ప్రశాంతంగా
దాన్ని కొనసాగించాలంటుంది సత్యగీత. మనసైన వాడిని మనువాడటమే కాదు,
మనవాడిని చేసుకోవడమూ మనసున పట్టాలంటుంది. స్త్రీగా సుందర సుకుమార
సౌరభాలు ఎంత అవసరమో, ధీర వీర గుణసమూహాలూ అంతే అవసరం అంటుంది.
అలాగని మనమేం రుద్రకాళిలా భద్రకాళిలా కనిపించనక్కర్లేదు. అవసరమైన చోట
అనితరమైన శక్తిని అనుసంధానం చేస్తే సరి! దుర్గమ్మ చేసింది అదే... సత్యమ్మ చేసిందీ
అదే... నేటి ప్రతి అమ్మా చేయాల్సిందీ కచ్చితంగా అదే!!

### మెప్పించి ఒప్పించి ...

ఓ క్లిష్టమైన పనిలో ముందడుగు వేసే ముందు మనకు దగ్గరి వాళ్లు తప్పకుండా అందులో కష్టనష్టాలను చెబుతారు. ఇప్పుడు ఆ పనిచేయడం అంత అవసరమా అన్న సందేహాన్నీ వెలిబుచ్చుతారు. సాక్షాత్తూ కృష్ణపరమాత్మ కూడా సత్యాదేవి యుద్ధరంగానికి వస్తానంటే అలాగే చెప్పాడు.

'సమద పుష్పంధయ ఝుంకారములు గావు,
భీషణకుంభీంద్ర బృంహితములు
వాయు నిర్గత పద్మవనరేణువులు గావు,
తురగ రింఖాముఖోద్ధూతరజము...
కన్య! నీవేడ? రణరంగ గమన మేడ?' అంటాడు.

జయ జయ ధ్వానాలు.. పూల వానలు.. దేవతలు వెలిగించిన దీపాల వరుసలు.. విజయ దరహాసంతో సత్యాకృష్ణులు. నరకాసుర సంహారం జరిగింది. దీపావళి పుట్టింది. సత్యాదేవి విక్రమ పరాక్రమాలను శ్రీకృష్ణుడితోపాటు లోకమూ సంభ్రమాశ్చర్యాలతో తిలకించింది. అతి సుకుమారి అయిన శ్రీకృష్ణుడి ప్రియసఖి అలవిగాని రాక్షసులను అలవోకగా మట్టుబెట్టింది. ఈ సన్నివేశానికి ముందు సత్య వేరు, తర్వాతి సత్య వేరు! కన్నయ్య ప్రణయ రాణిగా పరిచయమున్న ఆమె వీరనారిగా వెలిగిన సందర్భమది. గరుత్మంతుడి మీద నిలబడి వింటినారిని సంధించిన ఆమె నారీలోకానికి సాటిలేని సూచనలు చేసింది. కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు మానవాళికి గీతను బోధిస్తే, ఈ యుద్ధక్షేత్రంలో సత్యాదేవి మహిళామణులకు మన్నికైన సంగతుల్ని నేర్పింది. రణరంగానికి వెళ్లడం నుంచి విజయంచేజిక్కించుకునేంత వరకూ ఆమె వేసిన ప్రతి అడుగూ ఓ పాఠమే!

# సత్య చెప్పిన గీత!


'సత్యా... యుద్ధ రంగమంటే ఏం అనుకున్నావు. పువ్వుల మీద వాలే తుమ్మెదల ఝుంకారాలు కాదు, భయంకరమైన ఏనుగుల ఘీంకారాలు వినిపిస్తుంటాయక్కడ. అక్కడ కనిపించేవి పిల్లగాలికి తామరపువ్వుల మీద రేగే పుప్పొడి రేణువులు కాదు, వేగంగా పరిగెత్తే గుర్రపు డెక్కల చివరల నుంచి లేచిన దుమ్ము దుమారాలు. ఆ చోటంతా శూలాలూ, ఖడ్గాలూ, రాక్షసులూ. సుకుమారీ నువ్వెక్కడ, ఆ రణరంగం ఎక్కడ? నేను ఇప్పుడే వచ్చేస్తానుగా... ఉండు' అంటాడు కృష్ణుడు. భామ వదలదు. అన్ని చెప్పాడని భయపడదు. తనను వద్దన్నాడని చిన్నబుచ్చుకోదు. ప్రాణ సఖుడికి మరింత దగ్గరగా చేరుతుంది. భుజం మీద గడ్డం ఆన్చి ఆయనకు మాత్రమే వినిపించేలా... 'దానవులు ఉంటేనేం... రాక్షస సమూహాలు ఉంటేనేం... శత్రు దుర్భేద్యమైన కోటల్లాంటి మీ భుజాల వెనుక నేనుంటే... నాకేం భయం' అన్నది. కాస్త పక్కకు జరిగి రెండు చేతులూ జోడించి నమస్కరించింది. ఆ మాటలకు కృష్ణుడు తబ్బిబ్బయ్యాడు. అభిమానంగా ఓ చూపు చూశాడు. 'దా... ఎక్కు' అన్నాడు పక్షీంద్రుడి వంక చూపుతూ. అదీ సత్యాసతీ సంధత!! సత్యమ్మ యుద్ధంలో తొలిమెట్టు ఎక్కింది ఇక్కడే. పెద్ద సవాళ్లు, మన వాళ్ల సలహాలు, ముందుకు వెళ్లే ఆలోచనలు.. అన్నిటినీ ఎలా నిర్వహించుకోవాలి అన్నదానికి చక్కనైన ఉదాహరణ ఈ సందర్భం.

### ఆత్మ విశ్వాసానికి ప్రతీకలా..

నరకుడు భయంకరమైన రాక్షసుడు. పద్నాలుగు లోకాలనూ ఆక్రమించాడు. ఎంతో బలగం ఉన్నవాడు. యుద్ధం అనగానే లక్షల సైన్యాన్ని మోహరించాడు. శ్రీకృష్ణుడు పాంచజన్యం పూరించగానే వాళ్లంతా గోలగోలగా కదిలారు. ఢంకాలూ బూరలూ పెద్దపెద్ద వాయిద్యాలతో చప్పుళ్లు చేస్తూ అరుస్తున్నారు. అయితేనేం, సత్య వెరవలేదు. అవసరం అనుకున్నప్పుడు అడుగు ముందుకు వేయడమే తప్ప వెనక్కి తిరిగే లక్షణమే లేదు ఆమెకు. నరకుడు ముందుకు ఉరకడం చూసి స్వామి చేతి నుంచి ధనుస్సును అందుకుంది. యుద్ధం నేను చేస్తాగా, నీకెందుకు... అంటూనే విలాసంగా వింటిని అందించిన కృష్ణుడే విస్తుపోయేలా శస్త్రాలు ప్రయోగించింది. తను బాణాలు సంధించడానికి ఎక్కడా ఇబ్బంది రాకుండా పొడవాటి జడను ముడివేసింది. చీర నడుముకు చుట్టింది. నగలన్నిటినీ సర్ది పెట్టింది. రాక్షస సంహారానికి స్వామి వినియోగించే మహత్తరమైన ధనువును చేతితో పట్టుకుని వంగి వింటినారిని కట్టి... టంకారం చేస్తుంటే సాక్షాత్తూ శ్రీకృష్ణుడే విస్తుబోయి చూశాడట. ఎంత వేగంగా విల్లును పట్టుకుందో, అంతే వేగంగా అస్త్రాలు సంధించడం మొదలుపెట్టింది. ఎడమకాలు ముందు పెట్టి, కుడికాలిని వంచి పట్టి ఆమె బాణాలు వేసే తీరుకు శ్రీహరి ముగ్ధుడైపోయాడు. ప్రచండమైన వేగంతో ప్రయాణించే గరుత్మంతుడి మీద ఆమె నిలబడి శరం సంధిస్తుంటే ప్రళయ కాలపు సూర్యుడిలా కనిపించిందట. ఒక్కో అస్త్రాన్నీ మంత్రించిరాక్షసుల మీదకు వదులుతుంటే కుప్పలకొద్దీ జనం చచ్చారట.


బొమ్మ పెండ్లిండ్లకు బోనొల్లనను బాల
రణరంగమున కెట్లు రాదలంచె?
మగవారి గనిన దా మఱుగు జేరెడు నింతి
పగవారి గెల్వ నే పగిది జూచె?
బసిడియుయ్యెల లెక్క భయ మందు భీరువు
ఖగపతి స్కంధ మే కడిది నెక్కె?

అనుకుంటూ ముక్కున వేలేసుకున్నాడట నారాయణుడు. రుక్మిణమ్మ బొమ్మల పెండ్లిండ్లు చేస్తున్నదట పల్లకీలో పోయిరామ్మా... అంటే అలసిపోతాను నావల్ల కాదు అని చెప్పే ఈ సుకుమారి రణరంగానికేల వచ్చింది. మగవాళ్లను చూస్తేనే పక్కకు తప్పుకొనే ఈ పడతి పగవాళ్లని మట్టికరిపిస్తున్నదా. బంగారపు ఉయ్యాలనెక్కమంటేనే భయమంటుందే... ప్రచండ వేగంతో ప్రయాణించే ఈ గరుత్మంతుడి మీద ఎక్కి యుద్ధం చేస్తున్నదా... అనుకున్నాడట పరంధాముడు. నిజంగానే... బంగారు ఉయ్యాల ఎక్కమంటే భయం అనేంత పిరికిగా కనిపించిందీ ఆ సత్యే. ఇవాళ ఖగపతి మీద వీర విహారం చేస్తున్నదీ ఆ సత్యే. అవును అవసరాన్ని బట్టి అవతారం ఎత్తాల్సిందే! కావాలనుకున్న చోట ఆత్మవిశ్వాసంతో కనిపించాల్సిందే! సమస్యను తీర్చాలంటే తెగించి వచ్చి తెలిసిన శస్త్రాలన్నీ ప్రయోగించాల్సిందే! ఆడది అంటే అబల కాదు... సబల అని త్రేతాయుగంలోనే నిరూపించిన సత్యభామ బాట... రోజువారీ జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలుకీ అష్టాక్షరీ మంత్రంలా పనిచేస్తుంది.



సాహిత్యం సందర్భం

ప్రతీ సోమవారం ప్రచురితమయ్యే సాహితీ సందర్భం పేజీకి సాహితీ వ్యాసాలు, కవితలు, కథాకవిత సంకలనాల సమీక్షలు, అభిప్రాయాలు పంపండి. ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, అభిప్రాయాలు పంపండి. తాజా అంశాలకు ప్రాధాన్యముంటుంది.
మీ రచనలు పంపాల్సిన చిరునామా: editor@mahaadaily.com





# ప్రజా సేవాభవన్‌లో చేరికల జాతర

- కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో చేరికలు
- ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గ్రామాలనుండి తరలివచ్చిన జనం
- కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి
- కంది శ్రీనన్ననేతృత్వంలో కాంగ్రెస్ బలోపేతం

**మహా ప్రతినిధి ఆదిలాబాద్ :** కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని పేద బడగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రజాసేవాభవన్ లో జరిగిన భారీ చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.సుధాగోని సుధాకర్ గౌడ్,ఆత్రం గంగారం పటేల్,సిడాం రాము పటేల్, టేకం సంతోష్ ఆధ్వర్యంలో అదిలాబాద్ రూరల్ మండలం అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధి లోని దొండరిగూడ,రాము గూడ,గుండంలొద్ది,పాకిడి గూడ గ్రామాల నుండి అలాగే డాక్టర్ మారుతి ఆధ్వర్యంలో చాందా టి గ్రామస్తులు దాదాపు రెండువందల మంది కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు తరలివచ్చారు. వారందరికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఎస్టీ ఎస్టీ బీసీ మైనారిటీల సోదరులు తనను గెలిపించ డానికి చాలా కష్టపడినట్టు చెప్పారు. మీ అందరి ఆశీర్వాదంతో వెంట కౌన్సిలర్లు జడ్పీటీసీలు యంపీటీసీలు పెద్ద నాయకులు ఎవరూ లేకున్నా 50వేల ఓట్లు వేసారని చెప్పారు. దీంతో అందరికి రుణ పడి ఉంటానని అన్నారు.. రోజుకు రోజుకు కాంగ్రెస్ పార్టీ బలపడుతోందని ,పార్టీ శక్తి పెరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ముందుగా గరీబోళ్లకే కేటాయిస్తుందని, రెక్కడితే గాని డొక్కాడని వారికి ముందుగా కేటాయిస్తామని తెలిపారు. 70 ఏళ్లుగా జరగని కుటుంబ సర్వే జరుగుతుందని, ప్రభుత్వం నిర్వహిస్తున్నసమగ్ర సర్వేలో ఉత్సాహంగా పాల్గొని వివరాలు తెలపాలని సూచించారు. భూమిలేని వారికి రేషన్ కార్డు లేని వారికి ఇండ్లు లేని వారికి న్యాయం జరుగుతుందన్నారు .పేదలందరికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆదిలాబాద్ లో మీ అందరికి కంది శ్రీనన్న అనే బంధువు ఒకతను ఉన్నాడన్న విషయం మర్చి పోవద్దన్నారు . ఏపని మీద ఆదిలాబాద్ కు వచ్చినా ఇక్కడ భోంచేయాలని సూచించారు. ఏ ఎన్నికలైనా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల మీద ప్రేమ ఉందని అందుకే 500 లకే , గ్యాస్ సిలిండర్ ,ఉచిత కరెంట్ ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,రుణమాఫీ లాంటి మంచి సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. రుణమాఫీ కాని రైతులకు తప్పకుండా అవుతుందన్నారు. ఇలాగే ప్రతీ ఊర్లో కూడా ఇంకా పార్టీ బలోపేతంకావాలని మంచి నాయకులు కార్యకర్తలలకు పార్టీలోకి రావాలని స్వాతం పలుకుతున్నానన్నారు. గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు గరీబోళ్ల కష్టంలో పాలు పంచుకోవాలన్నారు. పేదలకు పథకాలు అందుతున్నాయో లేవో తెలుసుకోవాలన్నారు. పేదోళ్లకు ఒక్క రూపాయి ఖర్చు లేకుంగా ఇందిరమ్మ ఇండ్లు వస్తాయన్నారు. గ్రామగ్రామాన పార్టీ బలోపేతమై రానున్నఅన్ని ఎన్నికల్లోనూ విజయ ఢంకా మోగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,ఎం.ఏ షకీల్,ఐఎన్టియూసి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,ఆదిలాబాద్ రూరల్ మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న, కౌన్సిలర్లు బండారి సతీష్,యెల్మెల్వార్ రామ్ కుమార్,నాయకులు ఎం.ఏ కయ్యుమ్,బూర్ల శంకరయ్య,తిప్పిరెడ్డి విట్టల్ రెడ్డి,దినేష్‌గౌడ్,కాప్డే పోచ్చిరామ్,అన్నెల శంకర్,అశోక్,దాసరి ఆశన్న, జాదవ్ భరత్ శ్రవణ్ నాయక్,ఎల్మ రామ్ రెడ్డి,బండారి చిన్నయ్య,సురేందర్ రెడ్డి,డాక్టర్ మారుతీ,వామన్,నైతం రమేష్,సాహెబ్రావు,మొహమ్మద్ సిరాజ్,షేక్ నసీర్,అల్లాబకష్,మోహిన్,నాగన్న,అస్బాత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలానా జయంతి ఉత్సవాలు

### హాజరైన స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి

### మైనార్టీ విద్యార్థులకు బహుమతుల ప్రధానం



**ఇబ్రహీంపట్నం మహా:** స్వతంత్ర భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 136వ జయంతి సందర్బంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, స్థానిక కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ 22వ వార్డు పరిధిలో గల వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు దూదిమెట్ల వెంకటేష్ఆధ్వర్యంలో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్సిట్యూషన్ సొసైటీలో నిర్వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విద్యార్థిలతో మాట్లాడి తమ సదుపాయాలపై ఆరా తీశారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని, విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్లపల్లి ధన్ రాజ్ గౌడ్, ప్రశాంత్ వివిధ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శంకర్, సురేష్ రెడ్డి, మైనారిటీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డిఎం గోపికృష్ణ

- జిల్లాలో 39 కేంద్రాలను ఏర్పాటు
- ఇబ్రహీంపట్నం పీపీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు
- రైతులు అధికారులు సమన్వయంతో ఉండాలి



**ఇబ్రహీంపట్నం మహా:** రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం పిపి కేంద్రంలో వడ్ల కొనుగోలు ప్రక్రియను డిసిఎంఎస్ జిఎం గోపికృష్ణ పరిశీలించారు. రైతులు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని ఎక్కడ కూడా పొరపాట్లు జరగకుండా, సరైన తూకం వేయాలని అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ...ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు వేచి ఉండేలా కాకుండా, సక్రమంగా కొనుగోలు చేయాలని అన్నారు. సోమవారం నుండి కొనుగోలు ప్రక్రియ మొదలు కావడం జరిగిందని, ఇబ్రహీంపట్నం పరిధిలోని పిపి కేంద్రాలలో వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేసే విధంగా అధికారులకు ఆదేశాలు అందించామని తెలిపారు. రైతులకు గోనె సంచులు కల్లాల వద్దకు ఇచ్చేది లేదని పిపి సెంటర్ వద్దనే సంచులు సమకూర్చడం జరిగిందని, గుణ సంచుల కొడతా ఇక్కడ కూడా లేదని రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాల వద్దకు తీసుకొని రావాలని అన్నారు. ఎక్కడ కూడా ఇబ్బంది కలగకుండా వ్యవసాయ అధికారులను జిల్లా అధికారులను స్పెషల్ ఆఫీసర్లను నియమించడం జరిగిందని, కొనుగోలు పూర్తయ్యేంతవరకు కేంద్రాల వద్దనే అధికారులు ఉంటారని రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైన అధికారులకు వెంటనే తెలియజేయాలని, రైతులు వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని రైతులు ఎలాంటి అపోహలకు పోకూడదని జనరల్ మేనేజర్ గోపికృష్ణ తెలిపారు. జిల్లాలో 39 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం మొదలు పెట్టామని రేపు ఎల్లుండి జిల్లాలోని మిగతా ప్రాంతాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. దాన్యం అధికంగా ఎక్కడైతే వస్తుందో అక్కడ అదనంగా పీపీ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఇబ్రహీంపట్నం స్థానిక రైతు మాజీ రైతుబంధు అధ్యక్షులు మొద్దు అంజిరెడ్డి మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన పీపీ కేంద్రంలో సక్రమంగా వడ్ల కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని, రైతులకు అధికారులు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తున్నారని అన్నారు. మండలంలో సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనే కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయడం బాగుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులు అధికారులు సమన్వయంతో ఉండి ఒకరికొకరు పరస్పరం సహకరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఓ శ్రీనివాస్, పిపిసి ఇంచార్జ్ వెంకటరాజు, అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో ముషాయిరా

### ముఖ్య అతిథిగా హాజరైన కంది శ్రీనివాస రెడ్డి

### ఉర్దూ భాషాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్న కెఎస్ఆర్

### షాహిరీ వినిపించి అలరించిన కంది శ్రీనివాస రెడ్డి



**మహా ప్రతినిధి ఆదిలాబాద్ :** ఉర్దూ భాషాభివృద్ధి కి తన వంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణంలోని భజరంగ్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ముషాయిరా, ఉర్దూ కవి సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి పూలమాలలు శాలువాలతో సత్కరించారు.అనంతరం వివిధ ప్రాంతాలనుండి నుండి వచ్చిన ప్రముఖ ఉర్దూ కవులు తమ షాహీరీలను చదవి వినిపించారు. కంది శ్రీనివాస రెడ్డికూడా ఒక షాహిరి చదవి సభికులతో పాటు ప్రేక్షకులను ఉత్సాహ పరిచారు. ఆయన చదవిన కవితకు స్పందనగా కరతాళ ధ్వనులు మిన్నంటాయి.మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. మైనారిటీల కు తాను ఎల్లవేళలా సహకరిస్తానని అన్నారు. తాను ఆదిలాబాద్ ప్రజలకు సేవ చేయడానికే వచ్చినట్టు ఆయన తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమం ఇలాగే ప్రతీ సంవత్సరం ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు.ఈ కార్యక్రమం లో కిజర్ పాషా,ఎం.ఏ కయ్యుమ్,ఎం.ఏ షకీల్,మొహమ్మద్ రఫీక్,షేక్ ఖాలీద్,నూర్ ఖాన్,సయ్యద్ షౌకత్ అలీ ,సయ్యద్ షాహిద్ అలీ,ఫయాజ్ షామా,షేక్ ఖలీం ,సలీం,నదీమ్,అతిక్ ఉర్ రహమాన్,ఉమేర్,తలా చౌష్,అఖిమ్,కర్మ,అజీజ్,షేక్ నసీర్,బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న,భరత్ శ్రవణ్ నాయక్,అన్నెల శంకర్,ఎల్మ రామ్ రెడ్డి,అశోక్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



## బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థిని ఆత్మహత్య

### గేట్ వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన

### విద్యార్థి నాయకులను చితక బాదిన సెక్యూరిటీ సిబ్బంది

### ఒకరికి తీవ్ర గాయాలు -ఆస్పత్రికి తరలింపు

**మహా నిర్మల్ :** బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ సెకండియర్ విద్యార్థిని స్వాతి ప్రియ ఆత్మహత్య ఘటన కలకలం రేపింది. ఆమెది ఆత్మహత్య అంటూ అధికారులు చెబుతుంటే..తమకు ఈ ఘటనపై అనుమానం ఉందంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ తరుణంలో ట్రిపుల్ ఐటీ వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. విద్యార్థి సంఘ నాయకులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని ఆందోళనకు దిగారు. సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ట్రిపుల్ ఐటీ లోపలికి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ గార్డ్స్ అడ్డుకుని చితకబాదారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా అదుపుతప్పి గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ ఘటనలో ఏబీవీపీ నాయకుడు ఒకరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. ట్రిపుల్ ఐటీ గేటు ఎదుట బైఠాయించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే సెక్యూరిటీ గార్డులు అత్యుత్సాహం ప్రదర్శించి కొట్టడం ఎంతవరకు సమంజసమంటూ నాయకులు ప్రశ్నించారు. అటు ఆందోళన విషయం తెలుసుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ విద్యార్థి నాయకులు ఈ సందర్భంగా ఆయనకు విన్నవించగా సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడంతో శాంతించి ఆందోళన విరమించారు.

## బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ డీసీపీ

**ఖమ్మం క్రైమ్, నవంబర్11, మహా:** ఏఆర్ అడిషనల్ డీసీపీగా సీహెచ్ కుమారస్వామి, సీసీఆర్బీ ఏసీపీగా పి. రవీందర్ రెడ్డి సోమవారం భాధ్యతలు స్వీకరించారు. ఆనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## తాంసీ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎస్పీ గౌస్ ఆలం

### రికార్డుల పరిశీలన

### స్టేషన్ ఆవరణలో మొక్క నాటిన ఎస్పీ




**ఆదిలాబాద్ మహా :** వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ గౌష్ ఆలం సోమవారం తాంసి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసారు. ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సిఐ కే ఫణిధర్ ఎస్పీకి పూల మొక్క అందించి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనాన్నిసమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒక మొక్కను నాటారు. పరిసరాలను పరిశీలిస్తూ పోలీస్ స్టేషన్ ను ఎప్పటికప్పుడు పరిశుభ్రతతో ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల ఎలాంటి చెత్త చెదారం, అనవసర మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ఉండాలని సూచించారు. అనంతరం రిసెప్షన్, లాకప్, రికార్డులు భద్రపరిచే గది, సాక్ష్యాధారాలను భద్రపరిచే గది, సిబ్బంది వేచి ఉండే ప్రదేశం, పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశీలించి పలు సూచనలు చేసారు.స్టేషన్లో ఈ సంవత్సరం నమోదైన కేసుల వివరాలు ప్రస్తుత స్థితిగతులపై విచారించారు, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదుదారు యొక్క ఫిర్యాదుని ఎప్పటికప్పుడు ఆన్లైన్ నందు నవీకరిస్తూ ఉండాలని ఎటువంటి పెండెన్సీ లేకుండా చూడాలని సూచించారు. సీఈఐఆర్ ద్వారా బాధితులు పోగొట్టుకొన్న సెల్ ఫోన్లను త్వరితగతిన తిరిగి అందించే విధంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కనుగొనాలని సూచించారు. రికార్డులను పరిశీలిస్తూ బాధితులకు న్యాయం చేసే విధంగా విచారణ చేపట్టి చార్జిషీటు దాఖలు చేయాలని సూచించారు. సమాజంలో పోలీసుల కీర్తిని పెంపొందించే విధంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సరిహద్దు వెంబడి ఆసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా అపరామత్తమై గస్తి నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకు యువతకు ప్రత్యేకంగా సైబర్ నేరగాలపై వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డైల్ 100 ను విరివిగా వినియోగించుకోవాలని తెలపాలన్నారు. స్టేషన్లో 5ఎస్ విధానాన్ని అమలుపరుస్తూ రికార్డులను పద్ధతి ప్రకారం నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కే ఫణిదర్, తాంసి ఎస్ఐ బి శివరాం నాయక్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మౌలానా అబుల్ కలాం సేవలు మరువలేనివి

### జిల్లా మైనార్టీ అధికారి రవీందర్ రెడ్డి

**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, మహా:** భారతదేశ మొదటి విద్యా శాఖ మంత్రి , భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలాం సేవలు మరువలేనివని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి అన్నారు. ములుగు మండలం దేవగిరి పట్నంలోని మైనార్టీ గురుకుల పాఠశాల లో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదిన వేడుకలు, మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవీందర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర అనంతరం దేశంలో విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి మౌలానా అబ్దుల్ కలాం ఎనలేని కృషి చేశారన్నారు. మైనారిటీల విద్యాభివృద్ధికి అబుల్ కలాం తోడ్పడ్డారని అన్నారు. విద్యార్థులు మౌలానా అబుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. శ్రీలత, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




## మిరప పంటలకు కొమ్మ కుళ్ళు తెగులు

**పాలేరు, నవంబర్ 11, మహా:** వాతావరణ మార్పుల కారణంగా మిరప పంటలకు తెగులు వ్యాధి సోకుతుందని, అందులో ముఖ్యంగా కొమ్మకుళ్ళు తెగులు ఎక్కువగా ఉందని, ఈ వ్యాధి నివారణకు పలు రకాల చర్యలు తీసుకోవాలని వైరా వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. ఆ వ్యాధి నివారణ కోసం రైతులకు సోమవారం పలు సూచనలు చేశారు. జిల్లాలో ఈ వాన కాలంలో మిరపను సుమారు 36,481 ఎకరాలలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మిరప పూతపిందె దశలో ఉంది. ఈ దశలో ఉన్న మిరపలో ప్రస్తుతం మారుతున్న వాతావరణ మార్పుల దృష్ట్యా మిరప పంటలకు కొమ్మ కుళ్ళు తెగులు వ్యాధి సోకినట్లుగా గమనించామన్నారు. తెగులును తొలి దశలోనే గుర్తించి, సకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని వారు రైతులకు సూచించారు.



## గురుకులంలో జోనల్ లెవల్ క్రీడా పోటీలు

**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, మహా:** క్రీడలలో విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఐఈఓ చంద్రకళ తెలిపారు. టీఎస్ డబ్ల్యూ ఆర్ఎస్ జాకారంలో టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో జోనల్ లెవెల్ క్రీడల పోటీలను నిర్వహించారు. జిల్లా డీసీఓ డాక్టర్ ఏ వెంకటేశ్వర్లు అధ్యక్షతన క్రీడలకు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించగా, ముఖ్య అతిథిగా డీఐఈఓ చంద్రకళ హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి మంచి పేరు సంపాదించాలన్నారు. విద్యార్థులు క్రీడారంగంలో ముందు ఉంటే ఏ రంగాన్నైనా సాధించగలరని ఆమె తెలిపారు. జాకారంలో క్రీడల పట్ల ఘనంగా ఏర్పాట్లు చేయడాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ములుగు ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని స్నేహభావంతో ముందుకు పోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకుపోతే ఉన్నత స్థాయిలో ఉంటారన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి క్రీడాకారులు డీసీఓలు, పీఈడీలు, పీఈటీలు అంతా కలిసి ఒలంపిక్ టార్చి ని వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. కాగా టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సాంబయ్య పటేల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ములుగు బాలికల గురుకులం విద్యార్థినీలు పాల్గొని నృత్యాలు చేయడంతో ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచారు. అతిథులన శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఓలు భిక్షపతి, శ్రీనివాస రావు, యాదగిరితోపాటు గురుకులాల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, సీనియర్ అధ్యాపకులు సురేష్ బాబు, రామ్ రెడ్డి, పీఈడీ వెంకట్ రెడ్డి, రామచంద్రం, యాదగిరి, బ్రహ్మాచారి, సదయ్య, ఆనంద్, దయానంద, పుల్లయ్య, మమత, రజిని, క్రీడాకారులు గురుకుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వాములకు అన్నదానం



**కామేపల్లి, నవంబర్ 11, మహా:** ఎంతో దీక్షతో, నిష్టతో అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల పూర్వజన్మ సుకృతమంటూ డీసీసీబీ డైరెక్టర్, కామేపల్లి మాజీ జెడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు. సోమవారం కామేపల్లిలో ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా అయ్యప్ప స్వాములకు మంద్రు పుల్లయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన నిత్య అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. దైవ సంకల్పం లేనిది మానవుని వల్ల ఏమీ జరగదని, ఎవరి ద్వారానో ఏదో ఒక రూపంలో పుణ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మకర జ్యోతి స్వరూపమైన అయ్యప్ప ఆశీస్సులతో గ్రామాలు పాడి పంటలతో పచ్చగా బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులైన 32వ పడి గురుస్వామి మంద్రు పుల్లయ్య స్వామిని మల్లి బాబు యాదవ్ తో పాటు అయ్యప్ప స్వాములు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మం రమేష్, మురళి రామారావు, హనుమంతు, బిక్షం, శీలం పుల్లయ్య, కొర్ర రాములు, అర్జున్, చిన్న అభిరాం నాగరాజు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, నవంబర్ 11:మహా:** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ప్రజల నుండి దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితిలోనూ పెండింగ్ లో ఉంచకుండా, సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన బట్టు రంగయ్య తాను కుష్టు వ్యాధితో బాధపడుతూ గతంలో వికలాంగుల పెన్షన్ పొందానని, ప్రస్తుతం వికలాంగ ధృవీకరణ సర్టిఫికెట్ గడువు ముగిసినందున ఫించన్ రావడం లేదని, తనకు సదరం సర్టిఫికెట్, ఫించన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆ దిశగా రంగయ్యకు సహకరించాలని అధికారులను ఆదేశించారు. కొణిజర్ల మండలం సాలెబంజర గ్రామానికి చెందిన బి. రాజేశ్వరి ఖమ్మంకు చెందిన శ్రీ జయ వీలాసిని డెవలపర్స్ కన్స్ట్రక్షన్ ఎండీ తనకు 17 లక్షల రూపాయలు ఇవ్వాల్సి ఉందని, ఆ డబ్బులు అడిగితే గిరిజన మహిళ నైన తనను ఫోన్ లో తిడుతూ రివాల్వర్ తో చంపుతానని బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించి అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తనకు రావలసిన పైకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం ఏసీపీకి రాస్తూ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వైరా మండలం గొల్లపూడి గ్రామానికి బోస్ బాబు రెవెన్యూ గ్రామం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణను ఆక్రమించి ఎయిర్టెల్ సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని ఫిర్యాదు చేయగా జిల్లా విద్యా శాఖ అధికారి పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోనకల్ మండలం పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన పి. సుమిత్ర సర్వే నెంబర్ 575 లో ప్రభుత్వం సుమారు 40 మందికి అసైన్ పట్టాలు పంపిణీ చేసిందని, అందులో తనకు 2 ఎకరాలు కేటాయించిందని, పట్టా పాస్ పుస్తకం కూడా ఉందని, తన భూమిలో 20 గుంటల భూమిని నాగబోయిన రమాదేవి ఆక్రమించిందని, ఆ భూమి తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహశీల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అంతకుముందు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందులో పర్యటించిన సింగరేణి జీఎం



**ఇల్లందు, నవంబర్ 11, మహా:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలో సోమవారం జీఎం(సెక్యూరిటీ) చందా లక్ష్మీనారాయణ పర్యటించారు. కోయగూడెం ఓసీ, జేకే 5 ఓసీ చెక్ పోస్టులతోపాటు వీటీఎస్ లో సెక్యూరిటీ పరమైన ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆయా పోస్టులలో రికార్డులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది విధులు ఎంతో బాధ్యతాయుతమైనవన్నారు. ఎల్లప్పుడు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ నిబద్ధతతో పనిచేయాలని, భద్రత పరంగా సంస్థ ఆస్తులను కాపాడాలని, అన్యాక్రాంతం కాకుండా అనునిత్యం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. సెక్యూరిటీ సిబ్బంది డ్యూటీ సమయంలో తమకు కేటాయించిన సెక్యూరిటీ పోస్టులను వదిలి బయటకు వెళ్లవద్దని, విధులలో కఠినంగా వ్యవహరించి సంస్థ ఆస్తులను కాపాడాలని తెలిపారు. జీఎం(సెక్యూరిటీ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించి ఇల్లందు ఏరియాకు మొదటిసారిగా వచ్చిన చందా లక్ష్మీనారాయణను ఏరియా జీఎం జాన్ ఆనంద్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏరియాలో నిర్వహిస్తున్న సెక్యూరిటీ పరమైన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ వి. కృష్ణయ్య, డీజీఎం(పర్సనల్) జీవీ. మోహన్ రావు, క్వాలిటీ అధికారి రామదాసు, ఏరియా సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, గుర్తింపు సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి టేబుల్ ఫ్యాన్ వితరణ



**టేకులపల్లి, నవంబర్11, మహా:** మండల కేంద్రంలోని గోల్యతండా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి అదే గ్రామానికి చెందిన భూక్యా సురేష్, సోనియా దంపతులు టేబుల్ ఫ్యాన్ వితరణ చేశారు. వీరికి అంగన్వాడీ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్ ఇందిరా, ఆయా వి. చాందితో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుప్పుమంటున్న గుడుంబా

### గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న తయారీ

**టేకులపల్లి, నవంబర్12, మహా:** మండలంలోని మారుమూల తండాల్లో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. గుడుంబా తయారీ దారులు గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా సాగిస్తున్నారు. మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందినవారు తక్కువ ధరలో లభించే గుడుంబా వైపు మరులుతున్నారు. దీంతో పల్లెలతోపాటు, మండలంల్లోనూ సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో రైతులు, కూలీపనులు, సూతారి పనులు చేసే వర్కర్లు, మధ్య తరగతి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా తయారీతో వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు గూడంబా వ్యాపారం నడిపిస్తున్నారు అని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాటు సారా బహిరంగానే విక్రయాలు జరుగుతున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. వేరే ప్రాంతాల్లో సారా విచ్చలవిడిగా తయారవుతున్నట్లు సమాచారం. గుట్టుచప్పుడు కాకుండా ప్లాస్టిక్ కవర్లలో నింపి రవాణా చేస్తున్నారు. గతంలో కిరాణం దుకాణంలో విక్రయదారుల నుంచి 5 కిలోల కంటే ఎక్కువ బెల్లం కొనుగోలు చేసినా వారి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉండేది. వాటిని ప్రతి నెలా ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖలకు ఇవ్వాల్సి ఉండేది. కానీ ఇప్పుడు ఆ ఆంక్షలు లేకుండా పోయాయి. ఎక్కడపడితే అక్కడ విచ్చల విడిగా బెల్లం విక్రయిస్తున్నారా అని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న గుడుంబా తయారీ, అమ్మకాలకు చెక్ పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## ఓఎస్డీగా భాద్యతలు స్వీకరించిన ఈసం కృష్ణయ్య



**ఇల్లందు, నవంబర్ 11, మహా:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా నూతన ఓఎస్డీగా సోమవారం ఈసం కృష్ణయ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏరియా జీఎం జాన్ ఆనంద్, వివిధ గనులు, విభాగాల అధిపతులు, ఏరియా అధికారులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లందు ఏరియాతో మంచి సంబంధాలు ఉన్నాయని, తన ఉద్యోగ ప్రస్థానం ఇల్లందులోనే ప్రారంభించడం జరిగిందని, అదే ఏరియాకు ఓఎస్డీగా వచ్చి భాద్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. నూతన ఉపరితల గని పనులలో అధికారులు అందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని, ఈ నూతన ప్రాజెక్ట్ త్వరగా ప్రారంభించుకోవడం వల్ల ఏరియాకు పూర్వవైభవం వస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఏరియా అధికారులతో ఇల్లందు ఏరియా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదక, రవాణా తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ఏజీఎం (ఐఈ) గిరిధర్ రావు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవింద రావు, ఏరియా సేఫ్టీ అధికారి రామస్వామి, డీజీఎం (పర్సనల్) మోహన్ రావు, డీజీఎం(సర్వే) బాలాజీ నాయుడు, డీజీఎం(సివిల్) రవికుమార్, మేనేజర్ పూర్ణ చందర్, అధికారులు నాగరాజు నాయక్, దిలీప్ కుమార్, మహేష్, అంజి రెడ్డి, శివకుమార్, యూనియన్ నాయకులు సారయ్య, నజీర్ అహ్మద్, రాజారాం, యాదగిరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో తొలి బయోమైనింగ్ కేంద్రం ప్రారంభం





**ఇల్లందు, నవంబర్ 11, మహా:** జిల్లాలో తొలి బయోమైనింగ్ కేంద్రాన్ని సోమవారం ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని తొలి బయో మైనింగ్ కేంద్రం ఇల్లందు మున్సిపాలిటీలో ప్రారంభించడం చాలా సంతోషకరమన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ లో డంపింగ్ చేసి గుట్టల గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను రీసైక్లింగ్ చేసి కాలుష్యం కాకుండా పర్యావరణాన్ని కాపాడడమే కాకుండా రీసైక్లింగ్ చేసే పద్ధతిలో చెత్తను వేరు చేసి ఎరువుని సేకరించి అందించడమే బయో మైనింగ్ యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. బయో మైనింగ్ కేంద్రం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. బయో మైనింగ్ ద్వారా పలు దశల్లో చెత్తను రీసైక్లింగ్ చేస్తుందని, ప్లాస్టిక్ పదార్థాలు ఎరువులు వేరుచేసి అందిస్తుందని పేర్కొన్నారు. రోజుకు రెండు మూడు టన్నుల చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు అణువుగా మిషన్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, డీఈ నవీన్, శానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, జవాన్ ప్రకాష్, మాజీ కౌన్సిలర్ యలమందల వాసు, కాంగ్రెస్ పట్టణ నాయకులు ఎర్ర ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి బూట్లు వితరణ



**ములకలపల్లి, నవంబర్ 11, మహా:** ములకలపల్లి మండలం తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థి అవసరాన్ని గుర్తించిన రమేష్ అనే ఉపాధ్యాయుడు తన సొంత డబ్బులతో బూట్ల జతను అందజేశారు. బూట్లు అందుకున్న విద్యార్థి ఆనందంతో పొంగిపోతూ, ఉపాధ్యాయుడు రమేష్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.శంకర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు రమేష్ చూపిన మానవత్వం విద్యార్థులకు నిజమైన ఆదర్శమన్నారు. చిన్నసాయమైనా, ఇలాంటివి విద్యార్థుల భవిష్యత్తులో విశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఇతర ఉపాధ్యాయులు నిర్మల, సురేష్, ప్రశాంత్ కూడా ఉపాధ్యాయుడు రమేష్ నిస్వార్థ సహాయాన్ని ప్రశంసించారు. ఉపాధ్యాయుడి మానవత్వం గ్రామస్థుల హృదయాలను తాకి, గ్రామస్థులు ఆయన సేవా భావానికి అభినందనలు తెలిపారు.

## రహదారి నిర్మాణం చేపట్టాలి

### ధరావత్ సురేష్ నాయక్



**టేకులపల్లి, నవంబర్11, మహా:** మండల కేంద్రంలోని సేవాలాల్ గుడి వద్ద రహదారి నిర్మాణం చేపట్టాలని సేవాలాల్ సేన డిమాండ్ చేసింది. మండల అధ్యక్షుడు బానోత్ కిషన్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ టేకులపల్లి మండల కేంద్రం నుండి కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ వరకు ఉన్న రోడ్డును సింగరేణి నిధులతో వెంటనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కొయ్యగూడెం ఓపెన్ కాస్ట్ నుంచి వచ్చే లారీలను అడ్డుకుంటామని వారు తెలిపారు. సింగరేణి యాజమాన్యం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. మండల కేంద్రం నుండి కోయగూడెం ఓపెన్ కాస్ట్ వరకు నిత్యం బొగ్గు రవాణా కొనసాగుతూ ఉంటుందన్నారు. బొగ్గు రవాణా చేసే వాహనాల కారణంగా రహదారి గుంతల మయం కావడంతో దుమ్ము, ధూళి అధికంగా వెలువడుతూ స్థానిక ప్రజల ఆరోగ్యాలకు గురవుతున్నారని ఆరోపించారు. కనీసం దుమ్ము లేస్తున్న ప్రదేశాల్లో ట్యాంకర్లతో నీళ్లు కూడా కొట్టకపోవడం చాలా దారుణమన్నారు. నిత్యం దుమ్ము, ధూళితో స్థానిక ప్రజలకు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం మండలంలో ఉన్న ప్రజల అందరి కొరకు మండల కేంద్రంలో క్యాన్సర్ క్యాంపు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నెల రోజుల వ్యవధిలో టేకులపల్లి మండల కేంద్రం నుండి కోయగూడెం ఓపెన్ కాస్ట్ వరకు రహదారి నిర్మాణం చేపట్టకపోతే సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు రాస్తారోకోలు చేపడుతామంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరుపుల లాలు నాయక్, యువసేన మండల ప్రధాన కార్యదర్శి, బోడ శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శత జయంతి ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలి

### సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. సారయ్య



**ఇల్లందు, నవంబర్ 11, మహా:** సీపీఐ శత జయంతి ఉత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. సారయ్య కోరారు. సోమవారం స్థానిక విఠల్ రావు భవన్ నందు జరిగిన సీపీఐ ఇల్లందు పట్టణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల పోరాట పోరు పతాక కష్టజీవులకు అండ సీపీఐ పార్టీ అని ఆయన అన్నారు. వచ్చే డిసెంబర్ 26న సీపీఐ వందవ సంవత్సరంలో అడుగు పెడుతున్న సంధర్భంగా పండగలా జరపాలన్నారు. భారత దేశంలో జమిలి ఎన్నికలు తీసుకురావడం తోపాటు కులాల మధ్య చిచ్చు పెడుతూ ప్రధాని పాలన కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. ఒక్కొక రాష్ట్రంలో ఒక్కో ఎన్నికల విధానం ఉన్నప్పుడు జమిలి ఎన్నికలు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అధ్యక్ష తరహా ఎన్నికల ద్వారా అన్ని రాష్ట్రాలను తమ చెప్పు చేతల్లోకి తీసుకుందామని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఉప చట్టం పేరిట తప్పుడు కేసులు పెట్టి ప్రశ్నించే గొంతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రొఫెసర్ సాయి బాబా మరణం ముమ్మాటికీ రాజకీయ హత్యేనని ఆరోపించారు. దేశంలో రోజురోజుకు నిత్యావసర ధరలను పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బ్రాంచ్ కార్యదర్శి, జిల్లా సమితి సభ్యుడు యండి నజీర్ అహ్మద్, సీపీఐ పట్టణ కార్యదర్శి బందం నాగయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాస శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్, కౌన్సిలర్ కుమ్మరి రవీందర్, కొరిమి సుందర్, బొల్లి కొమరయ్య, గడదాసు నాగేశ్వరరావు, నేల్లి కొమరయ్య, చాట్ల గణపతి, సంజీవ చారి, కొత్తపల్లి సాంబమూర్తి, చెరుకు సారయ్య, దాట్ల వెంకటేశ్వర్లు, బజారు ఆంజనేయులు, కలవల రాజారామ్, బందం లక్ష్మి, కనకతార, అలుగు సరిత తదితరులు పాల్గొన్నారు.




## మావోయిస్టుల కదలికలపై డీజీపీ ఆరా

- కాలం చెల్లిన సిద్ధాంతాలతో మావోయిస్టులకు ఒరిగేదేమీలేదు
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలి
- ఆదివాసీ గ్రామాలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి
- ఐటీసీ గెస్ట్ హౌస్ లో అధికారులతో సమన్వయ సమావేశం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 11, మహా:** తెలంగాణ రాష్ట్ర డీజీపీ డా. జితేందర్ సోమవారం సారపాకలోని ఐటీసీ గెస్ట్ హౌస్ కు చేరుకున్నారు. ముందుగా సమన్వయ సమావేశానికి విచ్చేసిన ఆయనకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్వాగతం పలికారు. సమావేశంలో పాల్గొన్న అధికారులందరూ ప్రస్తుతం సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై ప్రస్తుత స్థితిగతులను డీజీపీ వివరించారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుని, అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టుల వలన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తెలంగాణ ఛత్తీస్ గఢ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పనిచేసే అధికారులు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. పొరుగు రాష్ట్రాల సరిహద్దు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయకులైన ఆదివాసీలను అభివృద్ధికి, సంక్షేమానికి దూరం చేస్తూ నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు తమ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా ఇతర సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నాయని అన్నారు. కానీ నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనాయకులు తమ ఉనికిని చాటుకోవడానికి ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటూ దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. అనంతరం డీజీపీ గారితో పాటు అధికారులందరూ భద్రాచలం సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ ఇంటిలిజెన్స్ శివధర్ రెడ్డి, మల్టీ జోన్ 1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, సీఆర్పిఎఫ్ అధికారులు, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ములుగు జిల్లా ఎస్పీ డా. శబరీష్, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే, గ్రేహౌండ్స్ ఎస్పీ రాఘవేందర్ రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ లు పాల్గొన్నారు.

## అందుబాటులోకి తేమశాతాన్ని పరీక్షించే పరికరాలు

**ఖమ్మం, నవంబర్ 11, మహా:** వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా తేమను పరీక్షించే పరికరాలను జిల్లాలోని అన్ని వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. జిల్లా రైతాంగం మండలాల్లో ఏఈఓ దగ్గర ఉన్న పరికరాలకు వివిధ పంటలలోని తేమ శాతాన్ని తెలుసుకోవాలని సూచించారు. రైతులు పండించే పత్తి విషయంలో తేమ శాతాన్ని ఈ పరికరాల ద్వారా పరీక్షించుకుని, తమకు అందుబాటులో ఉన్న సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకెళ్లవచ్చునని అన్నారు. పత్తి రైతులకు కనీస మద్దతు ధర కల్పించుటకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పత్తి రైతులు జిల్లాలోని ఖమ్మం మదిర, నేలకొండపల్లి, వైరా ప్రాంతాల్లో ఉన్న జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల వద్ద పత్తి పంటను అమ్ముకోవాలన్నారు. జి ఆర్ ఆర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, వెంకటగిరి, శ్రీ సాయి బాలాజీ జిన్నింగ్, ఆయిల్ మిల్లు తల్లంపాడు, మంజీత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ మటూర్, అమరావతి టెక్స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ దడికూరు, శ్రీ శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీస్ ఇల్లెందులపాడు, ఉషాశ్రీ కాటన్, జిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సువర్ణాపురం, స్టేప్లెరిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్ తల్లాడ, జి ఆర్ ఆర్ జిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పొన్నెకల్, శ్రీ భగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్ గొలితండాలలో ఉన్న సీసీఐ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈనెల 8వ తేదీ వరకు 915.62 మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ 449 మంది రైతుల నుండి కొనుగోలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 7521/గా ఉన్న నేపథ్యంలో, రైతులు కనీస మద్దతు ధర పొందడానికి పత్తి తేమ శాతాన్ని 8% నుండి 12% మధ్యలో ఉండేలా చూడాలన్నారు. 12% కంటే ఎక్కువ తేమ ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయదన్నారు. రైతులు పత్తిపై నీరు చల్లకుండానే తీసుకవస్తే మద్దతు ధర పొందే అవకాశం ఉందన్నారు. రైతులు తమ పత్తిని ఒకేసారి కాకుండా దశల వారీగా సమీపంలోని కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకురావాలన్నారు.

### పంట బుకింగ్‌కు వాట్సాప్ సేవలు

రైతుల సౌకర్యం కోసం మార్కెటింగ్ శాఖ 8897281111 అనే వాట్సాప్ సేవను ప్రారంభించింది. ఈ నెంబర్ ద్వారా రైతులు తమ ఇంటి వద్ద నుండే పంట బుకింగ్‌లో ఉన్న వివరాలను తెలుసుకోవచ్చు. పత్తి అమ్మకం విస్తీర్ణం, పత్తి సాగు అర్హత, సీసీఐ కేంద్రం వద్ద వేచి ఉన్న సమయం, కొనుగోలు వివరాలు మొదలైన వివరాలను కూడా తెలుసుకోవచ్చునని చెప్పారు. సీసీఐ కేంద్రాలకు వచ్చే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నెంబర్ వంటి వివరాలు తీసుకొని రావాలన్నారు.

# ములుగు మొదటి స్థానంలో నిలవాలి

**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 11, మహా:** ప్రపంచ దేశాల్లో 2028 నాటికి ఆర్థిక ప్రగతిలో భారత్ మూడో స్థానంలో ఉండే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని, మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ఆఫీసర్లు చిత్తశుద్ధితో కృషి చేస్తూ సంపూర్ణ అభియాన్ కార్యక్రమంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ నినాదంతో కేంద్రం పనిచేస్తుందని వెల్లడించారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ములుగుకు వచ్చిన కేంద్ర మంత్రికి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సీహెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేషులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ములుగు కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి, సమ్మక్క సారలమ్మ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాలపై వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ జిల్లాలోని వెనుకబడిన మండలమైన కన్నాయిగూడెంలో జులై నుంచి సెప్టెంబర్ వరకు జరిగిన సంపూర్ణత అభియాన్ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీతి అయోగ్ జిల్లాలో సూచించిన ఆరు ఇండికేటర్లను, మండలంలో సూచించిన ఇండికేటర్ ల పురోగతి, వాటి అమలులో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 112జిల్లాలలో 500బ్లాక్ లలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం అమలు చేయడం జరుగుతోందని, దేశ సమగ్ర అభివృద్ధి కోసం సంక్షేమ ఫలాలు అందరికీ అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. 2018 ఏడాదిలో భారతదేశం ఆర్థిక ప్రగతిలో 11వ స్థానంలో ఉండేదని, ప్రస్తుతం 5వ స్థానానికి చేరిందని, దానిని 2028 కల్లా మూడవ స్థానానికి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు.

## కన్నాయిగూడెంను అభివృద్ధి చేస్తాం

### మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ఆఫీసర్లు చిత్తశుద్ధితో కృషి చేయాలి

### కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



నందిపహాడ్ గొత్తికోయ గూడెంలో కేంద్ర మంత్రి

2018లో దేశవ్యాప్తంగా 112 జిల్లాలను ప్రామాణికంగా తీసుకున్నామని, 2023లో దేశవ్యాప్తంగా 500 ప్రత్యేక బ్లాక్ లను గుర్తించి ఆ ప్రాంతాలలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 10బ్లాక్ లను ఎంచుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలాన్ని ఎంచుకున్నామని తెలిపారు. నీతి ఆయోగ్ ద్వారా ఎంపిక చేసుకున్న ఆరు ప్రామాణిక అంశాలను అమలు చేయడంలో లక్ష్యాన్ని ఏ మేరకు చేరుకున్నారు..?, ఎలాంటి అవాంతరాలు తలెత్తుతున్నాయి..? తదితర అంశాలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై పూర్తిస్థాయిలో అందరికీ అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. మళ్లీ త్వరలోనే సంపూర్ణత అభియాన్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ములుగు ప్రాంతం మొదటి స్థానంలో నిలిచేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

ములుగులో సమీక్ష అనంతరం వెంకటాపూర్ మండలంలోనీ లింగాపూర్ సమీపంలో గల నంది పహాడ్ గొత్తికోయ గూడెంలోనూ సందర్శించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసిన తాగునీటి బోర్‌వెల్, వాటర్ ట్యాంక్, కమ్యూనిటీ టాయిలెట్లు, కమ్యూనిటీ షెడ్ లను కేంద్ర హోం వ్యవహారాల శాఖ పి.ఎస్.ఆంధ్ర వంశీతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అన్న ప్రాసన, గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ విద్య, వైద్యం, వ్యవసాయం, ఆర్థిక పురోగతులు సాధించాలని, క్షేత్రస్థాయిలో కేంద్ర సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికే జాతీయ గిరిజన విశ్వవిద్యాలయానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించామని, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ అభివృద్ధి కోసం కృషి జరుగుతోందన్నారు. ప్రసాద్ స్కీంలో చేర్చి పనులు పురోగతిలో ఉన్నట్లు వెల్లడించారు. చిట్టచివర ఉన్న గ్రామాల్లోని ప్రజలు అభివృద్ధికి చేరువ కావాలని ఆకాంక్షించారు. లింగాపూర్ గ్రామంలో రైతులు, మహిళా స్వయం సంఘాలు, పలువురు గర్భిణీలతో మాట్లాడిన కేంద్ర మంత్రి వారికి కేంద్రం, రాష్ట్రం నుంచి అందుతున్న పథకాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

### కార్యకర్తలతో కలిసి భోజనం

జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ములుగు మండలం జంగాలపల్లి వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలను కలిసి ముచ్చటించారు. వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్ రెడ్డి, అజ్మీర కృష్ణవేణి నాయక్, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, రాజు నాయక్, భూక్యా జవహర్లాల్, బీజేపీ జిల్లా నాయకులు వాసుదేవరెడ్డి, శీలమంతుల రవీంద్రాచారి, నగరపు రమేష్, రాయంచు నాగరాజు, ఆకుల నాగేశ్వర్ రావు, మండల లవన్ కుమార్, ఆడెపు భిక్షపతి, మందల రమణారెడ్డి, ములుగు, వెంకటాపూర్ మండల అధ్యక్షులు గాదం కుమార్, పైడాకుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్లాస్టింగ్‌లు నిలిపివేయాలి

## ముదిగొండ, రాఘవాపురం గ్రామస్తులు



**ముదిగొండ, నవంబర్ 11, మహా:** మండల కేంద్రమైన ముదిగొండ ఎస్సీ, బీసీ కాలనీ, రాఘవాపురం గ్రామాల అతి సమీపాన కంకర క్వారీలు, నిర్వహణతోపాటు అక్రమంగా బాంబు బ్లాస్టింగ్లు చేయటంతో గ్రామంలోని 300 ఇండ్లు, గోడలు పగుళ్లు వచ్చి నెర్రెలతో బీటలువారి ఉన్నాయని, బ్లాస్టింగ్లు నిలిపివేయాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం తహశీల్దార్ కె. సునీత ఎలిజిబెత్ కు వినతిపత్రం అందజేశారు. కంకర క్వారీలలో బ్లాస్టింగులు ఇలాగే కొనసాగితే నెర్రెల బారిన ఇండ్లు ఎప్పుడూ కూలతాయో తెలియని పరిస్థితి ఉందని గ్రామస్తులు ఎమ్మార్వో దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో ఏండ్లనుంచి అతి లోతుగా కంకర క్వారీలు ఇష్టరీతినా నిర్వహించడం వల్ల భూగర్భజలాలు అడుగంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటితో తమకు ముప్పు ఉందని వారు పేర్కొన్నారు. లోతైన కంకర క్వారీలతోపాటు, అక్రమ బాంబ్ బ్లాస్టింగ్ లు నిలిపివేసి యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ, రాఘవపురం గ్రామస్తులు మెట్టెల సతీష్, కె భాస్కర్, పుచ్చకాయల సురేష్, పి నరేష్ పాల్గొన్నారు.

# గంజాయి కాల్చివేత



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 11, మహా:** రూ.2.90కోట్ల విలువ చేసే 1160కిలోల గంజాయిని సోమవారం దగ్ధం చేసినట్లు ఖమ్మం జిల్లా డిప్యూటి కమిషనర్ జనార్ధన్ రెడ్డి తెలిపారు. భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 35 కేసుల్లో పట్టుబడిన గంజాయిని కాల్చివేతకు డిస్పోజల్ అధికారిగా డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి అదేశాలు ఇచ్చారు. భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 35 కేసుల్లో పట్టుబడిన గంజాయిని తల్లేడ మండలం గోపాల్‌పేట్ లో ఉన్న దహన కేంద్రంలో దగ్ధం చేసిసిట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గంజాయిని దగ్ధం చేసే కార్యక్రమంలో ఖమ్మం డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, భద్రాది కొత్తగూడెం ఎక్సైజ్ సూపరిండెంట్ జనాయ్య, భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ రహీమ్ ఉన్నీషా బేగం ఉన్నారు. గంజాయిని దహనం చేయడానికి ప్రయత్నాలు చేసిన ఖమ్మం జిల్లా ఎక్సైజ్ అధికారులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

# సహజ వనరులను లూటీ చేస్తున్నారు

## సీఐటీయూ రాష్ట్ర నాయకులు బండారు రమేష్

**అశ్వారావుపేట, నవంబర్ 11, మహా:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బూర్జువా విధానాలతో పెట్టుబడిదారీ వ్యాపారులు సహజ వనరులను లూటీ చేస్తున్నారని సీఐటీయూ రాజకీయ విద్యా విభాగం రాష్ట్ర నాయకులు బండారు రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్వారావుపేటలోని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ, ప్రైవేటీకరణకు పెరుగుతున్న ప్రాధాన్యం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సత్యసాయి కళ్యాణ మండపంలో సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణా తరగతుల్లో ఆర్థిక విధానాలు, కార్మిక రంగంపై వాటి ప్రభావం అనే అంశంపై బండారు రమేష్ క్లాసులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సరళీకరణ విధానాలు దేశానికి తీవ్రమైన ముప్పుగా మారాయని, వీటివల్ల కార్మిక వర్గం పట్ల అన్యాయమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పాలకుల విధానాలతో కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలు కోల్పోతున్నాయన్నారు. ఆర్థిక అంతరాలు మరింత పెరిగిపోతుండటంతో మానవ సంబంధాలు పెనుమార్పులకు గురవుతున్నాయన్నారు. సమాజంలో అశాంతి నెలకొంటోందని బండారు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పెట్టుబడిదారీ వ్యాపారాలు అధిక లాభాలు ఆశించి సహజ వనరులపై దౌర్జన్యంగా హస్తం వేస్తున్నాయన్నారు. ఈ స్పెక్యులేటివ్ ఆర్థిక వ్యవస్థ ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తోందన్నారు. కార్మికవర్గం ఐక్యంగా సరళీకరణ విధానాలను తిప్పికొట్టాలంటూ బండారు రమేష్ పిలుపునిచ్చారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## విద్య, వైద్యానికి పెద్దపీట.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం, నవంబర్11, మహా:** రైతు కళ్లలో ఆనందం చూడడానికి, రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మంత్రి ఖమ్మం రూరల్ మండలం చిన్నవెంకటగిరి గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. పలువురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ/షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతు కళ్లల్లో ఆనందానికి చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ చేపట్టిందని, 27 రోజుల్లోనే రూ. 18 వేల కోట్ల రుణమాఫీ చేసిందని, ఇంకా రూ. 13 వేల కోట్ల రుణమాఫీ డిసెంబర్ మాసంలోగా పూర్తి చేస్తుందన్నారు. గతంలో ఇందిరమ్మ ప్రభుత్వం 19,36,000 ఇండ్లు కడితే, ఇప్పుడు మొదటి విడతగా 4,50,000 ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తుందని, రాబోయే 4 సంవత్సరాల్లో 20 లక్షల ఇండ్ల లక్ష్యంగా అందిస్తుందని హామీ ఇచ్చారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**నేలకొండపల్లి, నవంబర్ 11, మహా:** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీజ ఆదేశించారు. మండలంలోని చెరువుమాదారంలోని ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం సందర్శించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. కేంద్రం నిర్వహకులను నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న రైతుల వద్దకు వెళ్లి కేంద్రం గురించి, అభిప్రాయాలు తెలుసుకున్నారు. స్వయంగా ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కేంద్రాల వద్ద అన్ని యంత్రాలు తప్పకుండా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలను కలిగించాలన్నారు. సౌకర్యాల కల్పన పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కేంద్రాల వద్ద నిబంధనల మేరకు తేమ శాతం రాగానే కాంటాలు వేయాలన్నారు. కాంటాలు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సీహెచ్ శివ, ఐకేపీ ఏపీయం ఆశోక్రాణి, గ్రామసమాఖ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల హక్కుల కోసం ఎర్రజెండా పోరాటం కొనసాగుతుంది

## సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి




**మణుగూరు, నవంబరు 11, మహా:** పేద ప్రజలు ఉన్నంతవరకు వారి హక్కుల కోసం సీపీఐ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉంటుందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి .అయోధ్య అన్నారు. సోమవారం కరకగూడెం మండల జనరల్ బాడీ సమావేశాన్ని వంగరి సతీష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్కే సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ప్రతి గ్రామంలో సీపీఐ జెండా తోరణాలు ఎగురవేయాలని, పార్టీ ప్రజాసంఘాల నిర్మాణం మహిళలు విద్యార్థులు, యువకులు నూతన కమిటీల నిర్మాణం చేపట్టాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను క్రోడీకరించి నాలుగు చట్టాలుగా తయారు చేసిందన్నారు దీని వలన ఎన్నో సంవత్సరాలుగా పోరాటం కొనసాగించి తయారు చేసుకున్న 44 చట్టాలను ప్రభుత్వం తూట్లు పొడిచిందని వారు ఆరోపించారు. ఇది కార్మికులకు అన్యాయం చేయడమేనన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. పోస్టల్, రైల్వే, బొగ్గు ఇలా ఒక్కొక్కటిగా ప్రవేట్ పరం చేస్తున్నారని వారు ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాస్వామ్య హక్కుల కోసం మనమందరం ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య మాట్లాడుతూ... పేద ప్రజల హక్కుల కోసం ఎర్రజెండా నిరంతరం పనిచేస్తుందని కులం, మతం, ప్రాంతం లేకుండా, అంతా ఐక్యమైత్యంగా అన్నదమ్ముల జీవించాలని, హక్కుల కోసం మనమే పోరాటం కొనసాగించాలని, మీకు అండగా కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు పనిచేస్తుందన్నారు. పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డిసెంబర్ 26న పార్టీ పుట్టి వంద సంవత్సరాల అయిన సందర్భంగా సీపీఐ శత జయంతి ఉత్సవాల్లో ఘనంగా నిర్వహించాల పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మున్నలక్ష్మీ కుమారి, జిల్లా సమితి సభ్యులు గడ్డం మనోహరాచారి, పినపాక మండల కార్యదర్శి పద్మనాభ రాజు, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు బాడిశ సతీష్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి, సీపీఐ సీనియర్ నాయకులు బోడ ముత్తయ్య తదితరులు హాజరయ్యారు.

# ఇంటింటి సర్వేలో ఖచ్చితమైన సమాచారం నమోదు చేయాలి

## తహశీల్దార్ అనంతరాజు



**చింతకాని, నవంబర్ 11, మహా:** నాగులవంచ, రైల్వే కాలనీ, పాతర్లపడు గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను తహశీల్దార్ కూరపాటి అనంతరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పట్ల మండల ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావద్దని సూచించారు. ప్రతి కుటుంబం యొక్క ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయలని అధికారులను ఆదేశించారు. సర్వేలో ప్రజల నుంచి వచ్చే సందేహం ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తనకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రఘు, సర్వే సిబ్బంది కృష్ణారావు, జానీ పాల్గొన్నారు.

# ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



**కొత్తగూడెం, నవంబర్ 11, మహా:** భారతరత్న పురస్కార గ్రహీత, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన వ్యక్తి, పరిపాలన దక్షకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అన్నారు. 11 ఏళ్లు విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించి, జాతీయ విద్యా విధానం అమలు చేశారన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఏటా ఈనెల 11వ తేదీన జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న మైనార్టీ వర్గాల్లో ఆయన అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. రచయితగా, కవిగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయవేత్తగా అనేక సేవలందించారన్నారు. ఆజాద్ మైనార్టీ అభ్యున్నతికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు, జిల్లా అధికారులు, మైనార్టీ సంఘ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాజా గౌస్ మొహినుద్దీన్‌కు ఘన సన్మానం




**ఇల్లందు, నవంబర్ 11, మహా:** స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజా గౌస్ మోహినుద్దీన్ ను కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఖాజా గౌస్ మోహినుద్దీన్ మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి రోజున తనను మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సన్మానించడం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి మరింత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

# ఐటీఐ అప్రెంటిషిప్ మేళా విజయవంతం




**మణుగూరు, నవంబరు 11, మహా:** మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన నేషనల్ అప్రెంటిస్ మేళా విజయవంతమైనట్లు ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు తమ శిక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలంటే అప్రెంటిషిప్ తప్పనిసరిగా చేయాలన్నారు. విద్యార్థులకు అప్రెంటిషిప్ అవకాశాలు కల్పించడం కోసమే ఇటువంటి మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేళాలో హైదరాబాద్ నుంచి వచ్చిన వివిధ కంపెనీలవారు వారికి కావలసిన విద్యార్థులను ఎంపిక చేసుకున్నారన్నారు. ఈ అప్రెంటిషిప్ మేళాకు సుమారు 50 మంది ఐటిఐ పూర్తి చేసిన వారు హాజరుకాగా 26 మందిని అప్రెంటిస్ కోసం ఎంపికయ్యారని ఆయన తెలిపారు. అప్రెంటిషిప్ చేయాలని అర్హత ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదిస్తే ఆయా కంపెనీలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ సాగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ధర్మాచారి, మణుగూరు ఐటిఐ ట్రైనింగ్ ఆఫీసర్ జి రవి, ఏటీవోలు జీవీ కృష్ణారావు, ఎం శ్రీనివాసరావు, ఏ నరసయ్య, వేణుగోపాల్ నాయుడు, వి ఎల్ ఆర్ కంపెనీకి చెందిన ధర్మ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ తడబాటు

## వరుణ్ చక్రవర్తి పోరాటం వృథా

### రాణించిన స్టబ్స్.. రెండో టీ20 సఫారీలదే



**గెబెహా:** దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా తొలి మ్యాచ్‌లో ఆలౌరౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న యువ భారత్.. రెండో మ్యాచ్‌లో బ్యాటర్ల వైఫల్యంతో ఓటమిపాలైంది. బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి (5/17) సంచలన స్పెల్‌తో మ్యాచ్‌ను భారత్ వైపునకు తిప్పినా ఆఖర్లో తడబడ్డ టీమ్ఇండియాకు పరాభవం తప్పలేదు. మ్యాచ్ ఆఖరి వరకూ ఆధిపత్యం చేతులు మారుతూ సాగిన మ్యాచ్‌లో సఫారీలు 3 వికెట్ల తేడాతో గెలుపొందారు. ఈ విజయంతో సౌతాఫ్రికా సిరీస్‌ను 11తో సమం చేసింది. టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి భారత్‌ను 20 ఓవర్లలో 124/6 పరుగులకే కట్టడిచేశారు. హార్దిక్ పాండ్యా (45 బంతుల్లో 39 నాటౌట్, 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ అయినప్పటికీ అతడు ఆఖర్లో విలువైన బంతులను వృథా చేశాడు. అక్షర్ పటేల్ (27), తిలక్ వర్మ (20) మినహా మిగిలిన టాపార్డర్ బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు. సఫారీ బౌలర్లలో పీటర్ (1/20), సిమెలానె (1/20), జాన్సెన్ (1/25), కొయెట్జి (1/25) సమిష్టిగా రాణించారు. స్వల్ప లక్ష్య ఛేదనలో వరుణ్ దెబ్బకు సఫారీలు విలవిల్లాడారు. కానీ ట్రిస్టన్ స్టబ్స్ (41 బంతుల్లో 47 నాటౌట్, 7 ఫోర్లు), గెరాల్డ్ కొయెట్జీ (9 బంతుల్లో 19 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) పోరాటం ఆ జట్టును గట్టెక్కించింది. స్టబ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. 120 బంతుల్లో 125 పరుగులు. సౌతాఫ్రికా విజయ సమీకరణం ఇది. సొంతగడ్డపై భారీ హిట్టర్లు కలిగిన ఆ జట్టుకు ఇదేం పెద్ద లక్ష్యం కాదు. కానీ వరుణ్ దెబ్బకు ఆ జట్టు ఒకదశలో 66/6తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే స్టబ్స్, కొయెట్జి పోరాటం ఆ జట్టును గెలుపు తీరాలకు చేర్చింది. ఛేదనలో రెండు ఫోర్లు కొట్టి జోరుమీద కనిపించిన ఓపెనర్ రెకెల్టన్ (13)ను అర్షదీప్ 3వ ఓవర్లో ఔట్ చేసి సఫారీలను తొలిదెబ్బ తీశాడు. ఆరో ఓవర్లో మొదలైంది వరుణ్ మాయ. సఫారీ బ్యాటర్లు బంతిని వదిలేస్తే వికెట్ల మీద ఉన్న స్టంప్స్ పడిపోవాల్సిందేనన్న రేంజ్‌లో అతడు మాయ చేశాడు.



## యశ్‌వర్ధన్ క్వాడ్రబుల్ సెంచరీ

గురుగ్రావ్: హర్యానా యువ ఓపెనర్ యశ్‌వర్ధన్ దలాల్ దేశవాళీ క్రికెట్‌లో సరికొత్త రికార్డు సృష్టించాడు. కల్నల్ సీకే నాయుడు అండర్-23 ట్రోఫీలో భాగంగా దలాల్ (465 బంతుల్లో 428 నాటౌట్, 46 ఫోర్లు, 12 సిక్సర్లు) క్వాడ్రబుల్ సెంచరీ సాధించాడు. 1973 నుంచి జరుగుతున్న ఈ టోర్నీలో ఇదే అత్యధిక స్కోరు. తద్వారా గతేడాది ఉత్తరప్రదేశ్ బ్యాటర్ సమీర్ రిజ్వి (312) సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్ లో సాధించిన రికార్డు కనుమరుగైంది.

# చాంపియన్ హైదరాబాద్

## ముగిసిన బాస్కెట్‌బాల్ టోర్నీ



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నీలో హైదరాబాద్ బాలబాలికల జట్లు విజేతగా నిలిచాయి. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్‌తో జరిగిన ఫైనల్‌లో హైదరాబాద్ 5023తో విజయం సాధించింది. బాలుర విభాగంలో 5628తో రంగారెడ్డిపై గెలిచింది. మహబూబ్‌నగర్ (బాలికలు), రంగారెడ్డి (బాలురు) జట్లు రన్నరప్‌తో సరిపెట్టుకున్నాయి. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాపిరెడ్డి, టోర్నీ రాష్ట్ర పరిశీలకుడు గోవర్ధన్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

## ఆసీస్ గడ్డపై 22 ఏండ్ల తర్వాత పాక్‌కు వన్డే సిరీస్..

### మూడో వన్డేలోనూ ఆసీస్‌కు పరాజయం

పెర్త్: ఇటీవలి కాలంలో వరుస వైఫల్యాలతో పాటు జట్టులో విభేదాలతో ఇంటా బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కుంటున్న పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ఆత్మవిశ్వాసాన్ని పెంచే సిరీస్ విజయం దక్కింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆ జట్టు మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 21తో గెలుచుకుని 22 ఏండ్ల తర్వాత ఆసీస్ గడ్డపై వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం పెర్త్ వేదికగా జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా మరోసారి బ్యాటింగ్‌లో విఫలమై 31.5 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. సీన్ అబాట్ (30) టాప్ స్కోరర్. పాక్ పేసర్లు షహీన్ అఫ్రిది (3/32), నసీమ్ షా (3/54), హరీస్ రౌఫ్ (2/24) క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఆసీస్‌ను దెబ్బతీశారు.



అనంతరం ఛేదనను పాక్ 26.5 ఓవర్లలోనే పూర్తి చేసింది. ఓపెనర్లు సయీమ్ అయూబ్ (42), అబ్దుల్లా షఫీక్ (37) తొలి వికెట్‌కు 84 పరుగులు జోడించి పాక్ విజయాన్ని ఖరారు చేశారు. 2002 తర్వాత పాక్‌కు ఆసీస్‌లో ఇదే తొలి వన్డే సిరీస్ విజయం కాగా నూతన సారథి మహ్మద్ రిజ్వాన్ మొదటి సిరీస్‌తోనే చారిత్రాత్మక విజయాన్ని తన జట్టుకు అందించాడు. ఇరుజట్ల మధ్య ఈనెల 14 నుంచి బ్రిస్బేన్ వేదికగా టీ20 సిరీస్ మొదలుకానుంది.



# సినిమా వార్తలు MOVIE NEWS




### విజయ్ దేవరకొండ ప్రైవేట్ ఆల్బమ్

## సాహిబా ప్రోమో రిలీజ్

రౌడీ హీరో విజయ్ దేవరకొండ బాలీవుడ్‌లో ప్రైవేట్ ఆల్బమ్ చేస్తున్న విషయం తెలిసిందే. హీరియే పాటతో క్రేజ్ తెచ్చుకున్న బాలీవుడ్ సెన్సేషనల్ సింగర్ జాస్లీన్ రాయల్ విజయ్‌తో ఈ ఆల్బమ్ చేస్తుంది. 'సాహిబా' అంటూ ఈ ఆల్బమ్ రానుండగా.. ఇందులో విజయ్ సరసన రాధిక మోహన్ నటిస్తుంది. ఇప్పటికే రాధికా- జస్లీన్ రాయల్ కాంబినేషన్‌లో వచ్చిన 'నై జానా' సాంగ్ సూపర్ సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. దీంతో ఈ సాంగ్ ఎలా ఉండబోతుందని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు. ఈ ఆల్బమ్‌కి సంబంధించి ఇప్పటికే ఫస్ట్ లుక్‌లు విడుదల చేయగా.. ఆకట్టుకుంటున్నాయి. ఈ సాంగ్‌ను నవంబర్ 15న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా 'సాహిబా' ఆల్బమ్ నుంచి ప్రోమోను విడుదల చేసింది. ప్రోమో చూస్తుంటే ఇందులో విజయ్ ఫొటోగ్రాఫర్‌గా కనిపించబోతున్నాడు.

## ఆఫిషియల్..

### పుష్ప 2 ట్రైలర్ డేట్ ఫిక్స్..

## ఎప్పుడంటే.!

ప్రపంచవ్యాప్తంగా పుష్ప గాడి రూల్ స్టార్ట్ అవ్వడానికి ఇంకా 24 రోజులు మాత్రమే అన్న విషయం తెలిసిందే. ఎప్పుడెప్పుడా అని అటు బన్నీ అభిమానులతో పాటు మూవీ లవర్స్ ఎదురుచూస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఈ సినిమా నుంచి వరుస అప్‌డేట్‌లను ఇస్తున్నారు మేకర్స్. ఇప్పటికే రష్మిక మందన్నా కొత్త పోస్టర్‌తో పాటు, శ్రీలీల పోస్టర్‌ను పంచుకున్న మేకర్స్ తాజాగా ట్రైలర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను నవంబర్ 17(ఆదివారం)న సాయంత్రం 6.03 గంటలకు బిహార్ రాజధాని పాట్నాలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా పుష్ప నుంచి కొత్త పోస్టర్‌ను పంచుకుంది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో తెరకెక్కుతున్న ఈ మూవీని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తుంది.



## ఉలగ నాయగన్ కాదు..

# కమల్ అని పిలవండి

ప్రఖ్యాత ఫిల్మ్ హీరో కమల్‌హాసన్ ఇవాళ ఓ భారీ ప్రకటన రిలీజ్ చేశారు. ఉలగ నాయగన్ అన్న టైటిల్‌ను పరిత్యజిస్తున్నట్లు ప్రకటించారు. తనను సినీ అభిమానులు యూనివర్సల్ హీరో అని పిలుస్తుంటారని, అయితే ఆ టైటిల్‌ను వదిలేస్తున్నట్లు ఆయన చెప్పారు. కమల్‌హాసన్ 2018లో మక్కల్ నీధి మయిం పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. తనను ముద్దుగా పిలిచే అన్ని టైటిళ్లను త్యజిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రేమతో తనకు బిరుదులు ఇచ్చిన అభిమానులకు కృతజ్ఞతతో ఉన్నట్లు తెలిపారు. కళాకారులను కళను మించి చూడరాదు అని, మీ ప్రేమాభిమానాలకు పొంగిపోతున్నట్లు కమల్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తనలో ఉన్న లోపాలను ఎప్పటికప్పుడు సవరించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. తన పేరు ముందు వాడే టైటిలళ్లను మర్యాదపూర్వకంగా వదిలేస్తున్నట్లు వెల్లడించారు. సింపుల్‌గా తనను కమల్ లేదా కమల్‌హాసన్ అని పిలిస్తే సరిపోతుందని సినీ అభిమానులను, పార్టీ కార్యకర్తలను, మీడియాను ఆయన కోరారు.





దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. SSMB29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా అని అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. హాలీవుడ్ సినిమాను తలపించేలా ఈ సినిమా ఉండబోతుందని రాజమౌళి ఈ సినిమా గురించి ఇప్పటికే హింట్ ఇచ్చాడు. దీంతో మూవీ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. మరోవైపు ఈ సినిమాను రూ.1000 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే సినిమా షూటింగ్ లోకేషన్స్ కోసం రాజమౌళి కెన్యా అంతా తిరిగి వచ్చాడు. అయితే తాజాగా మూవీలో హీరోయిన్‌కి సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో ఫిమేల్ లీడ్ రోల్‌లో హాలీవుడ్ హీరోయిన్ భారత సంతతికి చెందిన నవోమి స్కాట్ (Naomi Scott)ను తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై నవోమితో రాజమౌళి చర్చలు కూడా జరిపాడని వార్తలు వస్తున్నాయి. కాగా దీనిపై జక్కన్న నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు రాజమౌళి కొడుకు కార్తికేయ కూడా ఇప్పటికే నవోమి స్కాట్‌ను ఇన్‌స్టాలో ఫాలో అవుతుండడంతో ఈ రూమర్స్ నిజం అయ్యేలా కనిపిస్తున్నాయి, ఇక నవోమి స్కాట్ విషయానికి వస్తే.. ఇంగ్లాడులో పుట్టిన భారత సంతతికి చెందిన మహిళ. నవోమి అమ్మ ఉషా స్కాట్ గుజరాతీ నుంచి ఇంగ్లాండుకు వలస వెళ్లింది. సినిమాల విషయానికి వస్తే.. అల్లాద్దిన్, విజర్డ్స్, ఛార్లీస్ ఎంజెల్స్, స్మైల్ వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది నవోమి.

## మహేశ్, రాజమౌళి ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా బ్రిటిష్ భామ..